


A Registered Telugu Christian Newspaper
R.N.I. No.: APTEL / 2004 / 13923
Being Circulated Around the World Among Telugu Christians

# క్రైస్తవ సమాజం

THE CHRISTIAN SOCIETY

సమగ్ర తెలుగు క్రైస్తవ సమాచార వార పత్రిక

ఎడిటర్ & పబ్లిషర్ : వేపూరి శ్యామ్ సుధాకర్ పేజీలు : 12 సంపుటి : 5 సంచిక : 226-227

## యెరూషలేము మేయర్‌గా రెవ. డా॥ కోన శౌరిబాబు!?

### 63 ఏళ్ళ స్వతంత్ర ఇజ్రాయిల్ చరిత్రలో భారతీయునికి అరుదైన సత్కారం



అంతర్జాతీయ సువార్తికులు, మన తెలుగువారైన రెవ. డా॥కోన శౌరిబాబుకు 'గుడ్ విల్ అంబాసిడర్' సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఇజ్రాయిల్ పర్యాటక శాఖ సీనియర్ డైరెక్టర్ జనరల్ రాఫెల్ బెన్హర్.



శౌరిబాబుకు హీబ్రూ బైబిల్‌ను బహూకరిస్తున్న ఇంటర్నేషనల్ డైరెక్టర్ మోషే ఇవెన్ జహవ్ మరియు రాఫెల్ బెన్హర్.

వార్త 3వ పేజీలో...

● చేతులు కాలాక...?!

## క్రీస్తును, కులాన్ని సేవించడం సాధ్యంకాదు

# కుహనా కులతత్వాన్ని క్రైస్తవ సంఘం నుండి తరిమికొడదాం

### 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్' జాతీయ సదస్సులో చారిత్రాత్మక తీర్మానం

- ప్రతి గంటకు ఇద్దరు దళితులపై దాడి
- ప్రతి రోజు ముగ్గురు దళిత మహిళలపై మానభంగం
- రెండు దళిత హత్యలు, రెండు దళిత గృహ దహనాలు...
- జాతీయ నేర విభాగం 2000 సం॥ లెక్కల ప్రకారం దళితులపై 25,455 కేసులు నమోదు
- దేశంలో కోటి 60లక్షల మంది అంటరానివారుగా నేటికీ పరిగణించబడుతున్నారు
- కులాల పేరుతో అణచివేతలపై క్రైస్తవ సంఘం బాధ్యత వహించాలి
- సంఘంలో అణచివేతలు, దురహంకారాలు, వేర్పాటువాదం మొదలైన వాటి విషయంలో క్రైస్తవ సంఘం పశ్చాత్తాపపడి, మార్పు చెందాలి
- ప్రతి మనిషి దేవుని స్వరూపంలో సృష్టించబడ్డాడు, ప్రతి మనిషి కోసం క్రీస్తు సిలువలో ప్రాణం పెట్టాడు
- సగటు దళితుడు అణచివేతకు, అమానుష దాడులకు గురవుతుంటే పట్టనట్టు వ్యవహరించడం క్రైస్తవ సంఘానికి సిగ్గుచేటు, అది క్రైస్తవ విశ్వాసానికి వ్యతిరేకం
- 'దళితులకు న్యాయం' అనే అంశంపై వాడి వేడిగా జరిగిన చర్చలు, దళిత వేదాంతం పై పుస్తకం విడుదల

వార్త 4వ పేజీలో..

## ఎఐసిసి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన కాంద్రు ప్రభుకుమార్



హైదరాబాద్ : 'ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్' (ఎఐసిసి) రాష్ట్ర అధ్యక్షులుగా కాంద్రు ప్రభుకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. (మిగతా 4లో)









# క్రైస్తవ సంఘాలా? కుల సంఘాలా...??

క్రీస్తు ప్రేమ పరిమళ సువాసనలు వెదజల్లబడాల్సిన క్రైస్తవ సంఘం నుండి ఘోర దుర్గంధం వెలువడుతోంది. మునుపెన్నడూ లేనంతగా కులం కంపు కొడుతోంది. బుక్కావాని తైలంలో పడిచచ్చిన ఈగల్లాంటి మనుషులు కుల తత్త్వంతో వారు చావడమే కాకుండా సంఘానికి ప్రేత కళలు అద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. కులమే సర్వం అన్నట్లు బ్రతుకుతూ నీతికి, నిజాయితీకి, యోగ్యతలకు, భక్తికి, చివరికి దేవుడిచ్చిన తలాంతులకు మసిపూసి మారేడుకాయ చేసి కులానికే పెద్ద పీఠ వేసే చౌకబారు ఆలోచనలు కలిగిన మనుష్యుల(సామెతలు 6:12-19)తో సంఘాలు రోజురోజుకీ నిండిపోతున్నాయి. ఆ మాటకొస్తే సంఘాన్ని క్రీస్తు మార్గంలో నడిపించాల్సిన సంఘకాపరులే ఇలాంటి గ్రుడ్డితనంతో బాధపడుతున్నారనడంలో సందేహం లేదు.

అగ్ర కులాల దురహంకారం ఎలాగూ విశ్వాసం ముసుగులో క్రైస్తవ సంఘం పై ఆధిపత్యం చెలాయిస్తోందన్నది నివురుగప్పిన నిప్పులాంటి నిజం. ఇక హరిజనుల్లో ఉపకులాల పోరు అంతకన్నా వెయ్యి రెట్లు తీవ్రంగా తయారై, భారత క్రైస్తవ సంఘం నడినెత్తిన నిలబడి తాండవిస్తోందంటే అతిశయోక్తి కాదు. ఒక రకంగా చెప్పాలంటే నేడు ఈ విషయంలో క్రైస్తవ సంఘం కంటే కుల సంఘాలే ఎంతో బెటర్. వారు ఏ విషయమైనా బహిరంగంగా మాట్లాడుకుంటారు. పోరాడుతారు. కాని క్రైస్తవ సంఘంలో పరిస్థితి అది కాదు. పైకి భక్తి ముసుగు ఏమాత్రం చెదరకూడదు. నూటికి నూరుపాళ్ళు క్రీస్తు బిడ్డల్లా చలామణీ అయిపోవాలి. కాని లోలోపల ఈ కుళ్ళంతా నిండి ఉండాలి. ఇది నేటి మన సంఘాలు, సంఘకాపర్లు, నాయకుల తీరు. ఒకరిపై ఒకరు పైచేయి సాధించడానికి ఎంత దిగజారుడు వేషాలైనా వేసేస్తారన్నమాట. ఈ విషయంలో మాత్రం ఎవ్వరినీ లెక్కచెయ్యరు. చివరికి క్రీస్తును కూడా! పైకి భక్తిపరుల్లా కనిపిస్తూ దేవుని శక్తిని ఆశ్రయించక (2 తిమోతి 1-5)నిర్జీవ క్రియలతో నిండుకున్న ఇలాంటి వారివల్ల క్రీస్తు వెలుగును లోకానికి పంచాల్సిన క్రైస్తవ సంఘాలు నిస్తేజంగా, నిర్జీవంగా తయారయ్యాయి. నామకార్థ భక్తిలో ఉంటూ కూడా ఆధిపత్యం చెలాయించుకోడానికి దేవుణ్ణే అడ్డంపెట్టుకునే మూర్ఖపు తెగింపు ఉన్న మనుష్యులతో మన సంఘాలు నిండి ఉండడం రోషమున్న క్రైస్తవులంతా సిగ్గుతో తలదించుకోవలసిన విషయం. సున్నం కొట్టిన సమాధుల్లాంటి బోధకులు, నాయకులున్నందుకు పౌరుషమున్న క్రైస్తవులంతా దేవుని సన్నిధిలో ఏకం కావలసిన రోజులివి. ఏక హృదయంతో, ఏకాత్మతో, నలిగిన హృదయాలతో దేవుని సన్నిధిలో గోజాడి, హృదయాలు కుమ్మరించాల్సిన తరుణమిది. దుష్టులు తమ దుష్టత్వాన్ని జరిగించడానికి ఇంతగా ఏక మనస్సుతో పనిచేస్తుంటే... ఇలాంటి దుష్టత్వం నుండి సంఘాన్ని రక్షించడానికి బాధ్యత, రోషం కలిగిన క్రైస్తవులుగా ఇంకెంత ఐక్యత అవసరమో ఆలోచించాలి. లేదంటే బాధ్యతారాహిత్యమౌతుంది. ఒక రోజున దేవునికి లెక్క చెప్పకోవలసి వస్తుంది. దుష్టత్వం జరిగించేవారు దాని విషయమై అంత బాధ్యతాయుతంగా పనిచేస్తుంటే, ఎంతో పట్టుదలగా ముందుకెళుతుంటే ఇదంతా చూస్తూ మనకెందుకులే మనమూ మన భక్తి... అనుకుంటూ సంఘమేమైతే మనకెందుకన్నట్లు భావిస్తే ఘోర తప్పిదమే అవుతుంది.

అందరూ నెహెమ్యాలు కాకపోవచ్చు కాని నెహెమ్యావంటి వ్యక్తులకు సహకరిస్తే సిథిలమైపోయిన యెరూషలేము గోడల్లాంటి క్రైస్తవ సంఘ విలువలు తిరిగి పునరుద్ధరించబడతాయి. భారం కలిగి పనిచేసే వారుంటే చాలు దేవుడే తన సంఘాన్ని బాగుచేసుకుంటాడు. నిలబెట్టుకుంటాడు. నీతి తిరిగి సంఘాల్లో స్థాపించబడుతుంది. ఎందుకంటే ప్రభువు వారు చెప్పినట్లు- 'శాస్త్రుల నీతికంటెను, పరిసయ్యుల నీతి కంటెను మీ నీతి అధికము కానియెడలమీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పచున్నాను.' (మత్తయి 5:20) అంటాడు. కాని ఈనాడు క్రైస్తవ సంఘం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఇది బహు బాధాకరం. లోకస్తుల కంటే ఘోరమైన రీతిలో కుల తత్త్వం పేరుకుపోయి వుంది. ఈ జాఢ్యం నుండి సంఘం విడిపించబడాలి. లేదంటే క్రైస్తవ సంఘం దేవుని సన్నిధిలో భారీ మూల్యమే చెల్లించుకోవలసి వస్తుంది. కళంకమైనను ముడుతయైనను అట్టిది మరి ఏదైనను లేని పవిత్రమైన నిష్కళంకమైన దానిగా సంఘాన్ని దేవుడు తన యెదుట నిలువబెట్టుకోడానికి ఇష్టపడుతున్నాడు. అందుకే సిలువలో తన ప్రాణాన్ని త్యాగం చేసాడు.

చివరిగా...ఓ మాట కులతత్త్వమనే దుష్టత్వాన్ని ప్రోత్సహించే వారిని ద్వేషించమని కాదు. వారిని చూచి జాలిపడాలి. వారి కొరకు పట్టుదలతో ప్రార్థించాలి. లేకపోతే వారి దుష్టత్వం వల్ల వచ్చిపడే వారి ముందు గతికి మనమే బాధ్యులమౌతాము. 'ఒకడు కులాన్ని , క్రీస్తును సేవించలేడు'. అంటూ క్రీస్తు నుండి మనలను దూరం చేసి సంఘాన్ని భ్రష్టుపట్టించే కుల తత్త్వాన్ని సంఘం నుండి తరిమికొడదాం అని 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్' తీసుకున్న నిర్ణయాన్ని, ఇచ్చిన పిలుపును సంతోషంతో స్వాగతించి సహకరిద్దాం. క్రీస్తు ప్రేమతో సంఘాన్ని తిరిగి నింపుదాం.




# రెవరెండ్ డాక్టర్ కోన శౌరిబాబు యెరూషలేముకు మేయర్‌గా నిలబడాలి

## ఇజ్రాయిల్ పర్యాటక శాఖ సీనియర్ డైరెక్టర్ జనరల్ రాఫెల్ బెన్వర్

ఇజ్రాయిల్ 63 సంవత్సరాల స్వతంత్ర్య చరిత్రలో ఇజ్రాయిల్ పర్యాటకశాఖ ఒక భారతీయ బృందానికి స్వాగతం పలికి గౌరవించడం జరగలేదు. అయితే 10/10/2010 తేదీన ఒక అరుదైన గౌరవాన్ని ఒక భారతీయునికి దక్కింది. 'ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బిబ్లికల్ థియోలజీ' వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రపంచ ప్రఖ్యాత సువార్తికుడు అయిన రెవ. డా।। కోన శౌరిబాబుకు దక్కింది. వారితోబాటు ఇజ్రాయిల్‌లోని బైబిల్ ప్రదేశాల అధ్యయనానికి వెళ్ళిన 53 మంది బృందానికి దక్కింది. యెరూషలేంలోని ఇజ్రాయిల్ పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యాలయంలోనికి డా।। శౌరిబాబు కు, వారి బృందానికి ఈ ఆహ్వానం లభించడమే కాకుండా ఆ శాఖ సీనియర్ డైరెక్టర్ జనరల్ రాఫెల్ బెన్వర్ ఒక ఆశ్చర్యకరమైన వ్యాఖ్య కూడా చేశారు. ఆయన మాట్లాడుతూ డా।। శౌరిబాబు యెరూషలేము యొక్క మేయర్‌గా నిలబడాలన్నారు. ఈ సందర్భంగా రాఫెల్ బెన్వర్‌తోబాటు ఇజ్రాయిల్ పర్యాటక మంత్రిత్వ శాఖ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మోషే ఇవెన్ జహవ్ డా।। శౌరిబాబును ఘనంగా సత్కరించి మరో ఐదేళ్ళు ఆయనను 'గుడ్‌విల్ అంబాసిడర్' గా నియమించారు. ఈ మేరకు ఆయనకు ఒక సర్టిఫికెట్‌ను అందజేసి, హీబ్రూ బైబిల్‌ను బహూకరించారు.

గత 26 సంవత్సరాలుగా రెవ.డా।।శౌరిబాబు ఇజ్రాయిల్‌కు అరబ్ దేశాల మద్దతును కూడగట్టడంలో ఎంతగానో కృషి చేస్తున్నారని, అదేవిధంగా బైబిలు పరిశోధనల నిమిత్తం ఇజ్రాయిల్ సందర్శనకు అనేక మందిని ప్రోత్సహిస్తున్నారని, ఇజ్రాయిల్ కొరకు ప్రార్థించేవారుగా సుమారు 10 లక్షల మంది భారతీయులను ఆయన సిద్ధం చేశారని వారన్నారు.

ఈ సందర్భంగా డా।। శౌరిబాబు మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు, యూదుడని, కన్య మరియ యూదురాలని, మొదటి అపోస్తలులు యూదులని, మొదటి క్రైస్తవులు యూదులని, మొదటి హతసాక్షులు యూదులని, మనం రోజూ చదువుకునే బైబిలులోని అనేక పుస్తకాలు యూదులచే వ్రాయబడినవి ఇలా మన విశ్వాసం యూదులతో ముడివడి ఉందని, వారి కొరకు, ఇజ్రాయిల్ దేశం కొరకు ప్రార్థించాల్సిన భారం క్రైస్తవులమైన మనందరిపై ఉన్నదని అన్నారు.

డా।। కోన శౌరిబాబు చేపట్టే బైబిల్ పరిశోధన యాత్రలకు తమ సంపూర్ణ సహకారం, మద్దతు ఎప్పుడూ ఉంటుందని పర్యాటక మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది.

యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వీలుగా పాలస్తీనా అజమాయిషీలో ఉన్న బైబిలు ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆధీనంలోకి తీసుకోవాలని ఆంధ్రా యూనివర్శిటీ(విశాఖపట్నం) జియాలజీ ప్రొఫెసర్ మరియు హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డా।। నాగ ధనుంజయ రావు ఇజ్రాయిల్ పర్యాటక మంత్రిత్వ శాఖను కోరారు. ఆస్ట్రేలియాకు చెందిన డా।।శామ్ థియోడోర్, జేసుదాస్ మ్యానుయేల్ మాట్లాడుతూ మంచి నిర్వహకత్వ, నాయకత్వ లక్షణాలు కలిగి బైబిల్‌పరంగా, చరిత్ర పరంగా, పురాతత్వ, శాస్త్రీయ ఆధారాలతో ఈ బిబ్లికల్ స్టడీ టూర్‌లో డా।। శౌరిబాబు చేస్తున్న బోధనలు అద్భుతమైనవని కొనియాడారు.

ఈ సందర్భంగా టూరిజం శాఖ డైరెక్టర్ కుమారి నాన్సీ షెడ్లజ్ 2011 యూద మరియు క్రైస్తవ క్యాలండర్లను బిబ్లికల్ స్టడీ టూర్ బృందానికి అందజేశారు.



# పరలోకంలో డినామినేషన్లు ఉన్నాయా...?

- టి. జాన్ గెర్షోన్ శ్రీనివాస రావు, అడ్వకేట్, హైకోర్టు
వ్యవస్థాపక అధ్యక్షులు : 'క్రైస్తవ ఉద్యమం', హైదరాబాద్.
సెల్ : 9849951262, 9963675041, 9000724943

క్రైస్తవ లోకంలో ప్రపంచ వ్యాప్తంగా లక్షల డినామినేషన్ల పేరుతో క్రైస్తత్వం ప్రచారంలో ఉంది. పాశ్చాత్య దేశాల్లోని క్రైస్తవ సంస్థలకు అనుబంధ సంస్థలు మరియు మన దేశంలో, రాష్ట్రంలో అనేకం మనుగడలో ఉన్నాయి. 'సహోదరులు ఐక్యత కలిగి నివశించుట ఎంత మేలు ఎంత మనోహరము' అని బైబిల్ సెలవిస్తుండగా కొందరు స్వార్థపరులు తమ స్వార్థ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం డినామినేషన్ల పేరుతో తమ వర్గాలను కాపాడుకుంటున్నారు. అందరి దైవం క్రీస్తు అని చెప్పి, క్రీస్తు ప్రేమను అందరికీ పంచాల్సిన వీరు డినామినేషన్లనే గోడలు కట్టుకొని దూరంగా జీవిస్తున్నారు. కొన్ని డినామినేషన్లయితే వారి డినామినేషన్ విశ్వాసులు, దైవజనులు మాత్రమే పరలోకంలో చేరతారని ఒక్కాణించి మరీ ప్రచారం చేస్తున్నారు. 'హృదయ శుద్ధి గలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు' అని బైబిల్ చెబుతోంది. మరి మనసును ద్వేషంతో, మత్సరంతో, ఆత్మీయ గర్వంతో నింపేసే ఇలాంటి మానవ కల్పిత డినామినేషన్లు మనిషి హృదయాన్ని ఎలా శుద్ధిగా ఉంచగలవు. అసలు పరలోకంలో ఈ హెచ్చుతగ్గులుఉన్నాయా? బైబిల్ ఈ డినామినేషన్లను మెచ్చుకుంటోందా? సమర్థిస్తుందా? పరలోకంలో ఈ డినామినేషన్, ఆ డినామినేషన్ అన్న బేధాలున్నాయా? హై క్లాస్, లోక్లాస్, జనరల్ కంపార్ట్‌మెంట్ల వారీగా పరలోకంలో ప్రత్యేక తరగతులు, ప్రార్థనా గుంపులు ఉంటాయా? అలా ఉన్నట్టు బైబిల్‌లో ఎక్కడా చెప్పబడలేదన్న విషయం ప్రతి ఒక్కరికీ విధితమే. లోక ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్న క్రైస్తవ మతప్రచార సంఘ నాయకులు క్రైస్తవ విశ్వాసులను, వారి విశ్వాసాన్ని సొమ్ము చేసుకోవడానికి వేసే ఎత్తుగడలే ఇవి. ప్రభువు మార్గంలో విశ్వాసులను నడిపించవలసిన వీరు, యేసు క్రీస్తు ప్రభువే నిజరక్షకుడని బోధించవలసిన ఆయా సంఘ కాపరులు, బోధకులు, సువార్తికులు, బిషప్‌లు, రైట్ రెవరెండ్లు, రెవరెండ్‌లు ప్రభువువారు మానవాళికి ఎంతో సులువుగా ఇచ్చిన రక్షణను, రక్షణ సువార్తను ఈ డినామినేషన్ల పేరుతో సంక్లిష్టం చేసి ప్రజలను అయోమయానికి గురిచేసి రక్షణకు, క్రీస్తుకు దూరం చేసేస్తున్నారు. పరలోకానికి ద్వారం వీళ్ళే అన్నంత సిద్దాంత రాద్ధాంతం సృష్టిస్తున్నారు. సిలువలో శ్రమపడి, రక్తమంతా కార్చి, ఘోర మరణాన్ని అనుభవించి మానవాళికి రక్షణను, స్వస్థతను ప్రసాదించిన యేసును సహితం మరిపించే విధంగా తమ గొప్పతనాలనే డప్పువాయించుకుంటూ తాము ప్రార్థన చేస్తే...తాము ముట్టుకుంటే...తమ నీడ పడితే... తమ వస్త్రాలు తాకితే స్వస్థత అన్నట్లుగా డంభాలు పలికే బోధకులెక్కువైపోయారు. యేసయ్యను మరిపించి తమ మినిస్ట్రీలను, తమ డినామినేషన్లను హెచ్చించుకునే విధంగాను, విశ్వాసులను తమ వెంట తిప్పుకునే విధంగాను, తామే దేవుని కుమారులం మిగతావారు కాదన్నట్టుగా దేవుని వాక్యాన్ని కూడా తమ స్వంత ప్రయోజనాలకే వాడుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే క్రైస్తవ పెద్దలు తమ స్వార్థ ప్రయోజనాలకు మాత్రమే ఈ డినామినేషన్లను వాడుకుంటున్నారు.

క్రైస్తవ సహోదరులారా గమనించండి! నిజాన్ని గ్రహించండి. మీరు డినామినేషన్లో ఉన్నప్పటికి సత్య సువార్తను అంగీకరించి, హృదయ శుద్ధి కలిగి దేవునికి యిష్టులుగా ఈ లోక యాత్రను సాగిస్తే తప్పక నీ ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు చేరుతుంది. ఈ లోకంలో సర్వ భోగాలు అనుభవిస్తూ, నీ ఇష్టారాజ్యంగా జీవిస్తే నీవు ఏ డినామినేషన్లో ఉన్నా దేవుని చేరలేవు. కనుక నీ డినామినేషన్‌ను బట్టి నీవు ఖచ్చితంగా పరలోకం చేరలేవు గాని, నీ ప్రవర్తన, నీ హృదయాన్ని శుద్ధిగా, దేవునికి ఇష్టమైన రీతిగా ఉంచుకోవడం వల్ల మాత్రం తప్పక పరలోకం చేరగలవు. బోధకులు తప్పక దేవుని రాజ్యంలో చేరిపోతారనుకోవడం ఒట్టి భ్రమ. వారేం చెప్పినా మనం గ్రుడ్డిగా నమ్మెయ్య కూడదని బైబిల్ చెబుతోంది. నిజానికి బోధకులే మరి కఠినమైన తీర్పు పొందుతారని బైబిల్ సెలవిస్తోంది. అందుకే మీరు బోధకులు కావద్దు అని కూడా హెచ్చరిస్తోంది. లోక వాంఛలను విడనాడి దేవుని కొరకు నమ్మకంగా బ్రతకగలమన్న నిశ్చయత, దేవుని స్పష్టమైన పిలుపు, సమర్పణ లేకుండా దయచేసి బోధకులు కాకండి. అనవసరమైన డినామినేషన్లు, మినీ ట్రస్ట్‌లు పెట్టి ధనార్జనో, పలుకుబడో ధ్యేయంగా పెట్టుకొని దేవుని ఉగ్రతకు గురికాకండి.

పవిత్రమైన క్రీస్తు మార్గాన్ని, మనుష్యులను పరలోకం చేర్చగల ఏకైక సత్య సువార్తను ప్రజలకు అందించాలనే పతన తప్ప ఎవ్వరినీ కించపరిచే ఉద్దేశ్యం నాకు లేదు. అన్యదా భావించక సదుద్దేశ్యంతో అర్థం చేసుకొని సువార్తకు ఆటంకాలుగా నిలుస్తున్న డినామినేషన్లను ప్రోత్సహించ వద్దన్నది నా సవినయ మనవి.

# ఆశీర్వాదకరంగా జరిగిన సువార్త మహా సభలు

*పాస్టర్ పులి ప్రకాష్, ప్రతినిధి, 'క్రైస్తవ సమాజం', శంఖవరం, తూ॥గో॥జిల్లా*

**శంఖవరం**(తూ॥గో॥జిల్లా) : స్థానిక మండలం బెండపూడి బేతేల్ బాప్టిస్ట్ చర్చివారు నిర్వహించిన యేసు క్రీస్తు రక్షణ సువార్త మహాసభలు అక్టోబరు11,12,13 తేదీలలో బెండపూడి గ్రామ పంచాయితీ ఆఫీసు దగ్గరనున్న సంతమార్కెట్‌లో గ్రామ నడిబొడ్డున నిర్వహించబడ్డాయి. ఈ సభలలో ముఖ్య ప్రసంగికులుగా రెవ. డా॥ బి.డి. కిరణ్‌కుమార్(విశాఖ) దైవ సందేశాలందించారు. బేతేలు బాప్టిస్ట్ సంఘ కాపరి రెవ.బి.ఆర్ బెంజమిన్ మరియు యూత్ క్వయిర్ వారు ప్రత్యేక ఆకర్షణగా దేవునికి మహిమకరమైన గీతాలు ఆలపించారు. ఈ సభలకు దూర ప్రాంతాల నుండి ప్రజలు కూడి వచ్చి సభల ద్వారా ఆత్మీయ మేలులు పొందారు. ఇంత ఘనమైన సభలు తమ గ్రామంలో నిర్వహించడం ఇదే ప్రధమమని తెలుపుతూ గ్రామస్తులు ప్రభువును స్తుతించారు.

# మేఘన ఇంటీరియర్ పీపుల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్యం

**కనకాయలంక**(యలమంచిలి మం., ప॥గో॥జిల్లా) :మేఘన ఇంటీరియర్ పీపుల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరు 7వ తేది బుధవారం కనకాయలంక గ్రామంలోని బేతేలు మందిరంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు సంస్థ అధ్యక్షులు డి.ఉదయభాస్కర్ తెలిపారు. సుమారు 400 మంది గ్రామస్తులు వైద్య పరీక్షలు చెయ్యించుకొని వైద్య బృందంచే ఉచితంగా మందులు అందుకున్నారని ఆయన తెలిపారు. ఇంగ్లాండు దేశానికి చెందిన 10 మంది వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఏలూరుకు చెందిన 'విన్ అవర్ నేటివ్స్' సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్ శ్రీమతి వి. వీరవేణి హాజరయ్యారు. ఈ శిబిరంలో సంస్థ సభ్యులు కారుపాటి శాంతిసాగర్, వి.శ్యాం సుధాకర్, జి.దుర్గారావు, కె.జోసెఫ్ స్టీఫెన్, సంఘ కాపరి ఎస్.జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న విదేశీ వైద్యుడు, మందులు పంపిణీ చేస్తున్న వైద్య బృందం

# 'దేవుడు' వాడుకుంటున్న సేవకులా? 'దేవుని' వాడుకుంటున్న సేవకులా?

## మహా విశాఖ పాస్టర్ల సదస్సులో బిషప్ రెబ్బా

**విశాఖపట్నం** : నేటి దినాలలో సేవకులు దేవుడు అభిషేకించి వాడుకుంటున్న సేవకులుగా కాకుండా దేవునిని తమ స్వార్ధం కొరకు వాడుకుంటున్న సేవకులుగా తయారయ్యారని బిషప్ రెబ్బా ఇమ్మానుయేలు విచారం వ్యక్తం చేశారు. అక్టోబరు 2న మహా విశాఖ వైయంసిఎ న్యూ సెమినార్ హాల్‌లో విశాఖపట్నం జిల్లా పాస్టర్ల సదస్సు జరిగింది. ఈ సభకు ప్రొఫెసర్ వి.అబ్రహాం అధ్యక్షత వహించారు. బిషప్ రెబ్బా మాట్లాడుతూ నీనివె ప్రజల నాశనం గూర్చి ప్రకటంచమని దేవుడు ఆదేశిస్తే ఆ ఆజ్ఞను ధిక్కరించి తర్షీషుకు పారిపోయిన యోనా వలే కాకుండా దైవ చిత్తాన్ని గ్రహించి ఆయన ప్రణాళిక ప్రకారం పరిచర్యలో నమ్మకంగా సాగిపోవాలని పిలుపు నిచ్చారు.

# ఎఐసిసి నూతన అధ్యక్షునిగా కాండ్రు ప్రభుకుమార్

*(1వ పేజీ తరువాయి)* అక్టోబరు 13వ తేదిన సికింద్రాబాద్ వైయంసిఎ హాలు లో జరిగిన ఎఐసిసి రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సుమారు ఎఐసిసి ప్రారంభం నాటి నుండి రాష్ట్ర స్థాయిలో వివిధ పదవులు చేపట్టి, కొన్నేళ్ళుగా సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన కాండ్రు ప్రభు కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 'ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్' ఆంధ్రప్రదేశ్ శాఖలో గత ఐదారేళ్ళుగా వివిధ కారణాల వల్ల ఏర్పడిన ప్రతిష్ఠంబన కారణంగా సభలో ఈ మార్పుకు పూర్తి మద్దతు దొరికిందని విశ్వసనీయ సమాచారం. గతంలో జరిగిన లావాదేవీలను, రికార్డులను బహిర్గతం చెయ్యాలని ప్రభుకుమార్ డిమాండ్ చేస్తూ లీగల్ నోటీసులు కూడా ఇచ్చినట్లు సమాచారం. ఏది ఏమైనా 'ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్' సామాన్యులకు, సగటు క్రైస్తవునికి అందుబాట్లో ఉండి ఆయా విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు అండగా నిలబడాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారు. ఆ విధంగా నూతన అధ్యక్షులు కాండ్రు ప్రభుకుమార్ సారధ్యంలో ఎఐసిసి అన్ని వర్గాలను కలుపుకుంటూ అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ ముందుకు సాగాలని కోరుకుందాం. వారికి 'క్రైస్తవ సమాజం' తరపున ఇవే మా శుభాభినందనలు.


## ఆత్మ సిద్ధపాటు సదస్సు

'ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్' (ఎఐసిసి) పశ్చిమగోదావరి జిల్లా శాఖ నవంబరు 22వ తేదిన నిర్వహించుచున్న అభిషేకములకు ఎంపికైనవారు తప్పనిసరిగా నవంబరు 20వ తేది శనివారం ఉ॥ 9గం॥ల నుండి సా॥ 4గం॥ల వరకు ప॥గో॥జిల్లా తణుకు, వేల్పూరు రోడ్డులో గల స్పిరిట్ & లైఫ్ చర్చిలో జరుగు ఆత్మ సిద్ధపాటు సదస్సుకు హాజరు కావలయును.

మరిన్ని వివరములకు :

సెల్ : 9491718283, 9948161007


# కుహనా కులతత్వాన్ని క్రైస్తవ సంఘం నుండి తరిమికొడదాం

*(మొదటి పేజీ తరువాయి)* క్రైస్తవ సంఘం అంధకార శక్తులతోను, దురాత్మలతోను వాటి సమూహాలతోను పోరాడడానికి, ఎదిరించడానికి (ఎఫెసీ 6:12) పిలువబడింది. అంతమాత్రమే కాకుండా దేవుని రాజ్య సమీప్యాన్ని గూర్చి తెలిసికొని మారు మనస్సు పొందాల్సి ఉంది(మార్కు 1:15). నేడు కుల వర్గాలు, కుల అణచివేతలు, కుల ప్రాతిపధికన ఘోరమై హింస మన దేశాన్ని, చివరికి క్రైస్తవ సంఘాన్ని కూడా దారుణ పరిస్థితుల్లోకి నెట్టి వేసాయని, దుష్టుడు ఈ దురాత్మను మన దేశంలో ముఖ్య ఆయుధంగా వాడుకుంటూ ఇతరులకు మాదిరిగా నిలవాల్సిన క్రైస్తవ సంఘాన్ని కూడా భ్రష్టు పట్టిస్తున్నాడని, ఎక్కడికక్కడ విడగొడుతున్నాడని, ఇది ఎంతో దయనీయమైన పరిస్థితి అని, ఇట్టి దురాత్మ కార్యాలను ఎందిరించుటకు సంఘం శక్తివంతంకవాలంటే దేవుని సన్నిధిలో పశ్చాత్తాప పడి, ఆత్మలో బలపడడాలి, ఎదురించాలి అందుకు ఇదే సమయమని 'వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్' (డబ్ల్యుసిసి) సహరాకంతో 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఆఫ్ ఇండియా'(ఎన్‌సిసిఐ) దేశ రాజధాని ఢిల్లీలో ఏర్పాటు చేసిన జాతీయ సదస్సులో పిలుపునిచ్చింది. అక్టోబరు 22 నుండి 24 వరకు జరిగిన ఈ సదస్సులో దళితులకు సమ న్యాయం అన్న అంశంపై ప్రధానంగా చర్చ జరిగింది. డబ్ల్యుసిసి ప్రతినిధులతోబాటు, భారత దేశంలోని ఎన్‌సిసిఐ సభ్య సంఘాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. మనుష్యులందరూ దేవుని స్వరూపంలో సృష్టించబడ్డారని బైబిల్ తేటగా తెలియజేస్తోందని, దేవుని స్వరూపంలో ఉన్న ఏ మనిషినీ తక్కువగా చూసే అధికారం మనిషికి లేదని, మానవ కల్పితమైన ఈ కులం అనేది కేవలం మానసిక రోగం లాంటిదని, ఈ బలహీనతను, రుగ్మతను విచ్ఛిన్నం చేసి మానవీయ విలువలను పరిరక్షించగల శక్తిని దేవుడు తన పిల్లలమైన మనకు అనుగ్రహించాడని పేర్కొన్నారు. దళితులు ఈ కుల వ్యవస్థలో ఎక్కువగా నష్టపోయారని, ప్రతి అడుగులోను కుల వ్యవస్థ వారిని తీవ్రంగా గాయపరిచిందని, అంతరంగంలో నాటుకుపోయిన ఈ కుల బీజం చివరికి ఒక చేదు ఫలాన్ని (మత్తయి 7:16,17) మనకు అందించిందని, ఫలితంగా దళితులు తమ ఆత్మ గౌరవాన్ని నష్టపోయారని, గుడిలో, బడిలో, కనీసం త్రాగే నీళ్ళలో, ఉద్యోగాల్లో, ఉపాధిలో...నష్టపోవడమే కాకుండా దళిత చిన్నారుల బాల్యం నలిగిపోయింది, ఛిద్రమయ్యింది, దళిత మహిళలు కొట్టబడ్డారు, హింసించబడ్డారు, చెరచబడ్డారు, హత్యగావించబడ్డారు. దళిత సోదరులు అణచివేతకు గురయ్యారు, జైళ్ళలో పెట్టబడ్డారు, హింసించబడ్డారు. దారుణమై విషయమేమిటంటే నేటికీ అనేక మంది దళితులు మనుష్య మలాన్ని, మరుగు దొడ్లను శుద్ధిచేసే వెట్టి పనికి అనేక రాష్ట్రాలలో వినియోగించబడుతున్నారు. వీరిలో అధికశాతం మహిళలే.



'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఇన్ ఇండియా' జాతీయ ప్రతినిధుల బృందం



దళితులకు సమ న్యాయం అనే అంశపై చర్చిస్తున్న డబ్ల్యుసిసి మరియు ఎన్‌సిసిఐ నేతలు



*'21వ శతాబ్దంలో దళిత వేదాంతం' పుస్తకావిష్కరణలో (ఎడమ నుండి కుడికి) జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా॥ సురేందర్ ఎస్. జోధ్కా, యోగేష్ కె. సక్సేనా (ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్), ఫిలిప్ పీకాక్, ఎన్‌సిసిఐ జాతీయ అధ్యక్షులు బిషప్ తారనాద్ సాగర్, దీనబంధు మంచాల, రోవెనా రాబిన్‌సన్, సత్యనాథన్ క్లార్కే*

ఈ దారుణాలన్నీ చూస్తూ క్రైస్తవ సంఘం మౌనంగా ఉండిపోవడం సిగ్గుకరమైన విషయమని, యేసు క్రీస్తు ప్రభువు ఈ భూమ్మీద జీవించిన దినాలలో ఈ విధమైన అణచివేతలను, బేధాలను నిర్మోమాటంగా ఖండించేవాడు, కాని ఆయన ప్రతినిధులముగా నేడు అట్టి బాధ్యత నెరవేర్చ వలసిన క్రైస్తవ సంఘం ఈ విషయమై గట్టిగా మాట్లాడలేని స్థితిలోకి దిగజారిందని, సంఘాలే కుల వర్గాల పోరుతో నిండివున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు.

ఈ పరిస్థితిలో మార్పు రావాలని, దేవుని సన్ని ధిలో ఈ విషయమై పశ్చాత్తాపపడి, క్రైస్తవ సంఘంలోనుండి కుల రక్కసిని తరిమి కొట్టాలని ఎన్‌సిసిఐ పిలుపు నిచ్చింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని కూడా చేసింది. క్రైస్తవులుగా క్రీస్తు మనసు కలిగి ఉండాలి కాని సాతాను ఎత్తుగడల్లో చిక్కుకుపోయాం. మత్తయి 6:24లో యేసు ఇలా అన్నాడు 'ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి ఒకని ప్రేమించును లేదా ఒకని పక్షముగా నుండి ఒకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు.' మనము క్రీస్తుకు నమ్మకమైన దాసులమై యున్నయెడల ఆయనలో ఏకత్వము కలిగి బేధాలు విబేధాలు విడచి క్రీస్తు శిష్యులముగా ముందుకు సాగుదాం. కుల బేధాల విషయంలో దేవుని సన్నిధిలో పశ్చాత్తాపపడి (I కొరింథి. 4: 13) కుల భారాల అణచివేతల క్రింద నలిగిపోయిన వారి పక్షాన నిలబడి (కీర్తన 103:6) దేవుని నీతిని స్థాపిద్దాం అంటూ ఈ సదస్సులో పిలుపు నిచ్చారు.

2011 లెంటు దినాలను సంఘం నుండి కులాన్ని పారద్రోలే కాలంగా పరిగణించాలని, సండేస్కూళ్ళలో, యౌవనస్తుల కూడికల్లో, స్త్రీ, పురుషుల కూడికల్లో, పాస్టర్ల, బిషప్‌ల రిట్రీట్‌లలో కులాన్ని సంఘం నుండి కూకటి వేళ్ళతో పెకలించివేసే దిశగా పాఠాలు సిద్ధం చేసి, పక్కా వాంగ్మయాన్ని తయారుచేసి మన జీవిత విధానంలోనే కుల బేధాలు లేకుండా చర్యలు చేపట్టాలని తీర్మానించారు. ఇది ఒకవేళ మనుష్యులముగా మనకు అసాధ్య మనిపించవచ్చును గాని దేవుని శక్తి మనకు సమస్తాన్ని సాధ్యపరచగలదన్న ధృడ విశ్వాసాన్ని ఈ సమావేశంలో వ్యక్తపరిచారు.

దళితులు ఎన్నెన్ని రీతులుగా అణచివేతకు గురి అవుతున్నదీ, క్రైస్తవ్యాన్ని స్వీకరించిన దళితులు ఎలా అణగద్రొక్కబడుతున్నదీ 'వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్' అనేక సంవత్సరాలుగా ప్రపంచం దృష్టికి తెస్తున్నదని, యునైటెడ్ నేషన్స్(యుఎన్) హ్యూమన్ రైట్స్ కమిషన్ దృష్టికి కూడా గతంలో తేవడం జరిగిందని, లూథరన్ వరల్డ్ ఫెడరేషన్ (ఎల్‌డబ్ల్యుఎఫ్) సహచర్యంతో 21 ఏప్రిల్ 2009లో జరిగిన దర్బన్ సదస్సులో కూడా ఈ విషయాన్ని ప్రస్థావించడం జరిగిందని డబ్ల్యుసిసి ఒక ప్రకటనలో పేర్కొంది. దక్షిణ ఆసియా దేశాలలో సుమారు 20 కోట్ల మంది దళితులు ఈ అణచివేతలకు గురవుతున్నట్లు డబ్ల్యుసిసి పేర్కొంది. ప్రాముఖ్యంగా 2010 భారత సదస్సులో మానవ మల విసర్జకాల శుద్ధికి దళితులను వినియోగించడాన్ని నివారించే చర్యలకు మద్దతు ప్రకటించింది. ఇది మానవ హక్కుల ఉల్లంఘనని పేర్కొంది.

## '21వ శతాబ్దంలో దళిత వేదాంతం' పుస్తకం విడుదల

'21వ శతాబ్దంలో దళిత వేదాంతం' అనే ఒక పుస్తకాన్ని ఈ సదస్సులో విడుదల చేశారు. అక్టోబరు 22వ తేదీన న్యూ ఢిల్లీలోని చర్చ్ ఆఫ్ నార్త్ ఇండియా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదలైన ఈ గ్రంథంలో దళిత వేదాంతానికి చెందిన 16 క్రొత్త రచనలుంటాయి. రెవ. డా॥ శాంతినాథన్ క్లార్కే, రెవ. డా॥ దీనబంధు మంచాల మరియు రెవ. ఫిలిప్ వినోద్‌ల సంపాదకత్వంలో ఉద్గ్రంథం వెలువడింది.

'వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్' డబ్ల్యుసిసి మరియు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ సంయుక్తంగా ఈ ముద్రణను ప్రచురించాయి. ఈ ప్రచురణ ప్రతి ఆన్‌లైన్ బుక్ షాపుల ద్వారా లభ్యమౌతోంది.


## తర్ఫీదు పొందిన పాస్టర్ కావలెను

ఒక ప్రముఖ సంస్థచే నిర్వహించబడుచూ సుమారు 400 మంది సభ్యులు గల సంఘమునకు కాపరిగా పనిచేయుటకు తర్ఫీదు పొందిన పాస్టర్ కావలెను.

మంచి జీతముతో బాటు గృహ వసతి కల్పించబడును.

వివాహితులకు ప్రాధాన్యత ఇవ్వబడును.

వివరములతో వెంటనే సంప్రదించండి :

సెల్ : 9963069484


'జీవజలములు' రేడియో పరిచర్యల తెలుగు క్రైస్తవ వెబ్‌సైట్‌ను దర్శించండి : www.jeevajalamulu.com

# నిరాడంబరంగా 'యేసే పరిష్కారం' క్రైస్తవ టెలివిజన్ ఛానల్ ప్రారంభం

ఉదయభాస్కర్, ప్రత్యేక ప్రతినిధి, ఏలూరు,ప॥గో॥జిల్లా

**ఏలూరు**(ప॥గో॥జిల్లా) : 24 గంటల సువార్త ఛానల్ 'యేసే పరిష్కారం' నవంబరు ఒకటవ తేదిన నిరాడంబరంగా ప్రారంభమైంది. ఈ చానల్ తొలుత జిల్లాలో ఈ ఏడాది డిసెంబరులో ప్రసారాలు ప్రారంభిస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ దైవజనులు సుమారు 250 మంది వర్తమానాలందిస్తారని త్వరలోనే మరిన్ని వివరాలను ఈ ఛానల్ గురించి అందిస్తామని సాగర్ తెలిపారు. అదే రోజు ఛానల్ వ్యవస్థాపకులు, ప్రముఖ టి.వి వర్తమానికులు, యేసే పరిష్కారం కార్యక్రమ నిర్వహకులు బ్రదర్ కారుపాటి శాంతిసాగర్ జన్మదినం కావడం విశేషం. స్థానిక బెరాకా చర్చిలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్స్ కౌన్సిల్ సభ్యులంతా పాల్గొని సాగర్ కొరకు, టి.వి ఛానల్ కొరకు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. సాగర్‌ను పూల మాలలతో అనేక మంది దైవజనులు సత్కరించారు. సాగర్ తల్లిదండ్రులు జెర్మియా దంపతులు మరియు భార్య పద్మ పాల్గొని కేక్ కట్ చేసారు. సేవకులందరికి ప్రేమ విందు చేశారు.


ఛానల్‌కు సంబంధించిన బ్రోషర్‌ను విడుదల చేస్తున్న పాస్టర్స్ కౌన్సిల్

## సమాజంలో మన సాహిత్యం

### పుస్తక సమీక్ష

**'మనసు లోతుల్లోకి దూరి...'**

(కవితా సంపుటి) డా॥ ఎన్. జయకుమార్ రావు

క్రైస్తవ తెలుగు సాహిత్య భాషలో విప్లవాత్మకమైన మార్పులు తేవాలని, అది ఒక ఉద్యమంగా చేస్తే గాని సాధ్యపడదని ఈ కవితా సంపుటిలో రచయిత 'నా నుడికారం' అని వ్రాస్తూ ఆయన లక్ష్యాలు, ధ్యేయాలు వివరించారు. ఆ మేరకు ఆయన చేసిన ఒక ప్రయోగమే ఈ పుస్తకం. ఇది క్రైస్తవ బుక్ డిపోలలో మాత్రమే గాక అన్ని పుస్తక విక్రయశాలల్లో లభించేలా చేయాలని ఆయన దీక్ష.

'క్రైస్తవ సాహితీ క్షేత్రంలో విరబూసిన ముద్దబంతి పువ్వులు, ముగ్ధమనోహరాలు. యదపై సవ్వడి చేసే మువ్వలు, గుండెల్ని చీల్చివేసే గుళికలు.'

– రెవ. డా॥ దాస్‌బాబు

తన కథానాయకుల 'మనసు లోతుల్లోకి దూరి' తెలుగు పాఠక ప్రపంచానికి ప్రబోధాత్మకమైన క్రైస్తవ విశ్వాస పుష్ప పరిమళాలను పంచారు.

– వేదశ్రీ రెవ. డా॥ డి.వి. దానియేలు

'భాషాపరంగా చూస్తే ప్రతి పదములోను, ప్రత్యక్షరంలోను తెలుగు వెలుగు జిలుగులు నేత్రపర్వంతో పాటు శ్రోతృపర్వం చేస్తున్నాయి'

– డా॥ మీగడ రామలింగస్వామి

**ప్రతులకు: ఆల్ఫా బుక్ సెంటర్స్, షాప్ నెం.: 73, ఎన్.టి.ఆర్. కాంప్లెక్స్, గవర్నర్‌పేట, విజయవాడ-2 లేదా ద్వారకా నగర్, విశాఖపట్నం-16, లేదా గురుద్వార ప్రక్కన, స్టేషన్ రోడ్, సికింద్రాబాద్-25 లేదా డా॥ ఎన్.జయకుమార్ రావు, 50-44-4, సీతమ్మధార, విశాఖపట్నం-13**

# పేద సేవకులకు చేయూతనిస్తామనే మోసగాళ్ళొస్తున్నారు జాగ్రత్త!

బ్రదర్ రత్నం ఫ్రాన్సిస్, ప్రతినిధి, 'క్రైస్తవ సమాజం', విజయవాడ, కృష్ణా జిల్లా

అది 2004 సంవత్సరం. విజయవాడ పాత రాజరాజేశ్వరి పేట, చంద్ర రాజరాజేశ్వరి పార్టీ ఆఫీసు వద్ద కె. యోహాను, మణి దంపతులు తమ ఇంటి డాబా పోర్షన్‌లో ప్రతి ఆదివారం ప్రార్థనా కూడికలు నిర్వహిస్తూ ఉంటారు. దాదాపుగా 20 మంది విశ్వాసులు పాల్గొనేవారు. ఒక ఆదివారం, బందరు, తాళ్ళపాలెం నుండి చిన్నం పౌలు (వెంకటేశ్వరరావు)అనే వ్యక్తి వచ్చి దైవ సేవకులు కొండల యోహాను, మణిలను ఉద్దేశించి, జాతీయ సంఘ కాపరులు, సువార్తికుల సంక్షేమ కమిటీ,ఒంగోలు ఏజెంట్‌ని.సంస్థ రిజిస్ట్రేషన్ నెంబరు 264/05. మీరు, మీ విశ్వాసులు, ఇంకా మీకు తెలిసిన వారితో రూ.1,150/–లు కట్టి సభ్యులుగా చేరండి అలా చేస్తే 'సంస్థ' ప్రతి నెల జీతం(ఫండ్స్) పంపిస్తుంది. మీరు డబ్బు కట్టినట్లు నేను రశీదు ఇస్తాను. రూ.1,150/– కట్టలేని వాళ్ళు కనీసం రూ.200/– కట్టి నా దగ్గర రశీదు తీసుకోండి. రెండొందలు కట్టిన వాళ్ళకు ఐదు వేల రూపాయిలకు పైగా పది వేల రూపాయిల లోను ఇప్పిస్తానని, వించి పేట, ఆరార్‌పేట, చిట్టినగర్‌లలో నివశించే 25 మందికి పైగా స్త్రీ పురుషుల దగ్గర అందినకాడికి డబ్బులు కట్టిం చుకొని జంప్. దాదాపు పాతిక మందికి పైగా జనం వచ్చి మీ మొహం చూసి కట్టాము మా డబ్బులు మాకు ఇప్పించమని యోహాను దంపతుల్ని ఒత్తిడిచేస్తే, యోహాను, మణెమ్మ సదరు ఏజెంటు(సిహెచ్ పౌలు)ని వెళ్ళి నిలదీసారు. దున్నపోతు మీద వాన పడ్డట్టు మన ఏజెంటుగారు తొణకకుండా, బెణకకుండా... మీరందరూ కట్టిన డబ్బు సాల్మన్‌రాజు? గారికి ఇచ్చాను. భయపడకండి మీ సొమ్ము ఎక్కడికీ పోదని దాదాపు ఐదేళ్ళ నుండి వాయిదాలేస్తూ ఒక్కొక్కసారి 'జయరాజు' కిచ్చానని పొంతనలేని 'సోది' చెపుతున్నాడు. ఇతని నిర్వాకం వల్ల తమ మందిరానికి వచ్చే విశ్వాసులు రావడం మానేసారని మా ప్రతినిధి ఫ్రాన్సిస్‌తో వాపోయారు. బాధితులు బందరు వెళ్ళి చిన్నం పౌలుని తాము కట్టిన డబ్బులిమ్మని అడిగితే, నాదగ్గర లేవు ఏంచేస్తారో చేసుకోండంటున్నాడట.

దేవుని మీద ఆధారపడడం మాని మనుష్యుల సహాయం వైపు నిత్యం ఎదురుచూచే వాళ్ళున్నంత వరకూ ఇలాంటి మోసగాళ్ళు ఆటలు సాగుతూనే ఉంటాయి. గనుక దేవుని మీద ఆనుకొని కష్టమైనా,నష్టమైనా నమ్మకంగా సేవ చేస్తే దేవుడు తనను నమ్ముకున్న వారిని విడిచిపెట్టే అన్యాయస్తుడు కాదు.

## సార్థక నామధేయురాలు కృపాసాత్వికమ్మ ఓదార్పు కూడికలో రెవ॥ జి.జె.ఆనంద్

పేరుకు తగినట్లుగా తన జీవితాన్ని ప్రభువులో గడిపిన ఖ్యాతి కృపాసాత్వికమ్మకే దక్కుతుందని రెవ॥జీజే ఆనంద్ ఉద్ఘాటించారు. అక్టోబరు 27 వ తేదిన ప్రభువునందు నిద్రించిన తాడేపల్లిగూడెంకు చెందిన వీపుజెర్ల కృపాసాత్వీకమ్మ ఓదార్పు కూడిక అక్టోబరు 29న గూడెంలో స్థానిక అంబేద్కర్ మెమోరియల్ హాల్లో జరిగింది. ఈ కూడికలో వాక్యపరిచర్య చేయడానికి వచ్చిన జ్యోతిఆనంద్ మాట్లాడుతూ క్రైస్తవ పేర్లు పెట్టుకుని దేవునికి వ్యతిరేకమైన జీవితాలు జీవిస్తున్న ఈ రోజుల్లో 30సం॥లు ఫెయిత్ చర్చి విశ్వాసిగా, మంచి ప్రార్ధనాపరురాలిగా, తన కుటుంబమంతటిని ప్రభువులోకి నడిపించి పలువురికి ఆదర్శమయ్యారన్నారు. 1932లో భీమవరంలో జన్మించిన తాను తన 14వ ఏట తణుకు పట్టణానికి చెందిన వీరాస్వామిని వివాహమాడారు. ఈమెకు 5 కుమారులు, 3 కుమార్తెలు, వీరిలో పెద్ద కుమారుడు డేనియల్ రాజు, పెద్ద కుమార్తె కెజియాభాయి ప్రభువునందు నిద్రించగా మిగతావారు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈమె ఏలూరు 'క్రైస్తవ సమాజం' ప్రతినిధి ఉదయభాస్కర్‌కు అత్తగారు. ఈమె మరణం కుటుంబానికి తీరని లోటు. కుటుంబ ఆదరణ కొరకు ప్రార్థిద్దాం.



# 'ఇండియన్ అపోస్తలిక్ డయాసిస్' వారి స్పందన

ఆగష్టు 19–26 సంచికలో 'బోగస్ పెళ్ళి లైసెన్స్‌లు ఇచ్చేవారిని నిలదీయండి' అని ప్రచురితమైన వార్తను ఖండిస్తూ వాస్తవాన్ని ప్రజలకు తెలియజేయాలని తలస్తున్నట్లు 'ఇండిపెండెంట్ అపోస్తలిక్ డయాసిస్' (ఐఎన్ఎ) గుంటూరు జిల్లా డయాసిస్ పేరుతో ఒక ప్రకటన పత్రికాఫీసుకు వచ్చింది. అందులో ఈ విధంగా పేర్కొన్నారు. ఐఎన్ఎ వారు పెళ్ళి లైసెన్స్‌లు ఇవ్వడం లేదు, వారు కేవలం డి.టిహెచ్ క్వాలిఫికేషన్ ఇస్తూ వివాహ అధికార పత్రాలను మాత్రమే ఇస్తున్నారని గమనించవలసిందిగా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పిడుగురాళ్ళలో గత ఆగష్టు మాసం నాల్గవ తేదిన ఎస్‌విఎస్ కళ్యాణ మండపంలో మాస్టర్ జయప్రకాష్‌చే ఏర్పాటు చేయబడిన కార్యక్రమంలో 150 మందికి పైగా వివాహ అధికార పత్రములు పొందారని ఆ ప్రకటన పేర్కొంది. 'ఇండియన్ నేషనల్ అపోస్తలిక్ డయాసిస్' మరియు 'థియోలాజికల్ ఓపెన్ యూనివర్శిటీ' అధినేత బిషప్ ఆర్టీ మారన్ టీమ్‌లోని కొర్నేలీ, శోభన్‌బాబు, జయప్రకాష్ తదితరులను పోలీసులు అరెస్టు చేయడం అవాస్తవమని అందులో పేర్కొన్నారు. పోలీసుల రాక పసిగట్టి బిషప్ ఆర్టీ మారన్ పరారవ్వలేదన్నారు. వారు పోలీసులను క్షమాపణ కూడా కోరలేదట. సొంత పూచీకత్తుపై వెళ్ళ లేదన్నారు. కనుక ఇలాంటి ప్రకటనలు క్రైస్తవ పత్రికలలో వ్రాయించినవారిని, వ్రాయుటకు సహకరించినవారిని త్రియేక దేవుడు క్షమించునుగాక అంటూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**మీ ప్రాంతంలో 'క్రైస్తవ సమాజం' పత్రికను పరిచయం చేయండి.**
**వివరాలకు : ఎడిటర్, 'క్రైస్తవ సమాజం',**
**11-6-26/1, గాంధీనగర్-2, నర్సాపురం - 534 275, ప॥గో॥జిల్లా.**

# స్వీకరించేవారెవరికైనా ఇదే మా సవాల్

## ఋజువు చేసినవారికి లక్ష రూపాయిల బహుమానం

**నర్సారావుపేట**(గుంటూరు జిల్లా) : 'ఇండియన్ నేషనల్ అపోస్తలిక్ డయాసిస్'(ఐఎన్ఎ) స్టేట్ ప్రిసైడింగ్ కమిటీ తరపున రెవ. ఏజెసి శోభన్‌బాబు మరియు సభ్యుల పేరుతో ఒక ప్రకటన పత్రికాఫీసుకు వచ్చింది. ఈ ప్రకటన యధాతథంగా ప్రచురిస్తున్నాము. ఫోన్ ద్వారా కోరిన మేరకు ఫోన్ రిక్వెస్ట్‌ను కూడా రికార్డు చేసుకొన్నమీదట ఈ ప్రకటనను ప్రచురిస్తున్నాము. ఇక యధాతథం చదవండి.

రెవ. హ్యారి సెబాస్టియన్ అను వ్యక్తి మా సంస్థ అయిన ఐఎన్ఎ డయాసిస్ తరపున గతంలో శిక్షణ తీసుకొని మా వద్ద గల సర్టిఫికెట్‌లన్నిటిని కాపీ చేసి మా డయాసిస్‌ను మరిపించే విధంగా డయాసిస్ నడిపిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని పాస్టర్లను మోసగించడమే కాకుండా డయాసిస్ చట్టబద్ధతను ప్రశ్నిస్తున్నట్లు మేము కనుగొన్నాము.

రెవ. హ్యారి సెబాస్టియన్ గాని, ఇతరులెవరైనా గాని మా డయాసిస్ చట్టబద్ధత లేని సంస్థ అని గాని, భారతదేశ చట్టానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు జరిపిస్తుందని గాని నిరూపించమని మేము సవాలు చేస్తున్నాము. మా డయాసిస్ నకిలీ సంస్థ అని నిరూపిస్తే ప్రభుత్వం తీసుకునే చర్యలకు మేము కట్టుబడి ఉంటాము. అంతే కాకుండా ఆ విధంగా నిరూపించిన వ్యక్తికి రూ. 1,00,000/– (అక్షరాల లక్ష రూపాయిలు) మేము బహుమతిగా చెల్లిస్తామని సవాలు చేస్తున్నాము. ఈ సవాలును ఎవరైనా స్వీకరించ వచ్చు, నిరూపించ వచ్చు. ఈ ప్రకటన ఇచ్చినవారి ఫోన్ నెంబర్లు : రెవ. జేఏసీ శోభన్‌బాబు, 9299997080, 9290067113

# త్వరలో విడుదల కానున్న ఐదు జిల్లా క్రిస్టియన్ డైరెక్టరీ

## దైవసేవకుల వివరాలు ఉచితంగా ప్రచురించబడతాయి : ర్యాంక్ అధినేత కె.కె.రాజు

**రాజమండ్రి**(తూ॥గో॥జిల్లా) : గత 12 సంవత్సరాలుగా 'ర్యాంక్ ఎల్లో పేజస్' అనే డైరెక్టరీని ఎంతో సమర్ధవంతంగా, క్రమంగా విడుదల చేస్తూ అనేక మంది మన్ననలందుకున్న 'ర్యాంక్ కమ్యూనికేషన్స్' వారు ఇప్పుడు ప్రత్యేకంగా 5 జిల్లాల క్రైస్తవుల కొరకు ఒక క్రిస్టియన్ డైరెక్టరీని త్వరలో విడుదల చేయనున్నట్లు ఆ సంస్థ అధినేత కె.కె.రాజు 'క్రైస్తవ సమాజం'కు తెలిపారు. తూర్పు, పశ్చిమగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన సమగ్ర క్రైస్తవ సమాచారం ఇందులో పొందుపరుస్తామని ఆయన తెలిపారు.

అయితే ఈ డైరెక్టరీలో పాస్టర్ల ఐక్య సంఘాలలోని పాస్టర్ల పేరు, చర్చి పేరు, సెల్ లేదా ఫోన్ నెంబరు పూర్తి ఉచితంగా ప్రచురిస్తామని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని కోరారు. పాస్టర్ల సంఘాల కార్యదర్శులు తమ సంఘంలోని దైవ సేవకుల జాబితాను పైన తెలిపిన విధంగా తమకు పంపినట్లయితే త్వరగా ఈ పని పూర్తవుతుందని అందుకు వారు సహకరించాలని కోరారు. అలాగే ప్రత్యేకంగా ఫోటోలతో సహా వెయ్యించుకోవాలని ఆశించినవారు తమను సంప్రదిస్తే. ఎంత ఖర్చవుతుందో చెప్పగలమన్నారు. మరిన్ని వివరాలు కావలసినవారు 9908264043 నెంబరుకు ఫోన్ చెయ్యవచ్చన్నారు.




**నేర్చుకోండి నేర్పించండి బైబిల్ నాలెడ్జ్ సాంగ్స్. లాగాన్ : www.jeevajalamulu.com**

## సింగపూర్‌లో ఎఐఐసి చైర్మన్‌కు సన్మానం

# ప్రపంచ దేశాల కొరకు ప్రార్థించండి : బిషప్ డా॥ ఆర్ హ్యారీ సెబాస్టియన్

**హైదరాబాద్ :** యెరూషలేమా నీ ప్రాకిరముల మీద నేను కావలి వారిని ఉంచియున్నాను. రేయైన పగలైన వారు మౌనముగా ఉండరు. యెహోవా జ్ఞాపకకర్తలారా! విశ్రమింపకుడి. ఆయన యెరూషలేమును స్థాపించువరకు లోకమంతట దానికి ప్రసిద్ధి కలుగజేయు వరకు ఆయనను విశ్రమింపనియ్యకుడి. తన దక్షిణ హస్తము తోడనియు, బాహుబలము తోడనియు యెహోవా ఈలాగున ప్రమాణము చేసెను. యెషయా 62 : 6-7.






అక్టోబరు 4వ తేది నుండి 10వ తేది వరకు 'ది వాచ్ మెన్ ఆన్ ది వాల్' అనే సంస్థ ఆధ్వర్యంలో, సింగపూర్ దేశంలో, సాల్వేషన్ ఆర్మీ క్యాంపస్‌లో 7 రోజులు ప్రపంచ దేశాల కొరకై ప్రార్థించడం జరిగింది.

**ఈ వాల్డ్ కాన్ఫరెన్స్‌కు హాజరైన దేశాలు :** అమెరికా, ఆఫ్రికా, కెన్యా, సింగపూర్, ఫిలిప్పైన్స్, థాయ్‌ల్యాండ్, మలేషియా, ఇండియా, పాకిస్థాన్, శ్రీలంక...

అంతర్జాతీయ అధ్యక్షులు రెవ.డా॥ మూసటోర్ మరియు డా॥ఎస్తేర్ టోర్ ప్రపంచ దేశాలు ఐక్యమై ప్రార్థించాలి, ద్వేషాలు, కక్షలు, ఆధిపత్య అహంకారాలు విడనాడాలని తమ ఉపన్యాసాల్లో పేర్కొన్నారు. ప్రతి దేశంలో కాపరులు, ప్రార్థనాపరులు బాధ్యతగా ప్రపంచ దేశాల కొరకై ప్రార్థన చేసేవారు ముందుకు రావాలన్నారు. ప్రతి దేశంలో ప్రార్థన ద్వారా కావలి కాయువారు కావాలని పిలుపునిచ్చారు. కోత విస్తారమే గాని పనివారు లేరు. ఉదా: ఫిలిప్పైన్స్ చుట్టూ 7 వేల ద్వీపములు (ఐలాండ్స్) ఉన్నాయి. కాని 7 వేల పట్టణాలలో ఒక్క క్రైస్తవ సంఘం కూడా లేదు. క్రైస్తవులు లేని పట్టణాలు ప్రపంచంలో అనేకం ఉన్నాయి. భారత దేశంలోనే ఇంకా క్రైస్తవత్వం లేని రాష్ట్రాలున్నాయని 'ఆలిండియా ఇండిపెండెంట్ చర్చెస్'(ఎఐఐసి) బిషప్ డా॥ ఆర్ హ్యారి సెబాస్టియన్ అన్నారు. దేవుని రెండవ రాకడ లోపుగా ప్రతి రాష్ట్రము, ప్రతి దేశము 'యేసు ప్రభువే' నిజమైన దేవుడని తెలియపరుస్తూ, ప్రతి దేశము యొక్క క్షేమము కొరకు ప్రార్థించాలన్నదే 'ది వాచ్‌మెన్ ఆన్ ది వాల్' యొక్క ముఖ్యోద్దేశ్యమన్నారు.

ఈ వరల్డ్ కాన్ఫరెన్స్‌లో అక్టోబరు 10వ తేది ఆదివారం బిషప్ హ్యారి సెబాస్టియన్‌కు 'ఇండిపెండెంట్ బెస్ట్ బిషప్'గా రెవ.డా॥ మూసటోర్ మరియు శ్రీమతి మూసటోర్‌లు శాలువ కప్పి సన్మానించారు. కరతాళ ధ్వనులు మిన్నంటుతుండగా మెమెంటో బహుకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వచ్చే ఏడాది అంటే 2011 మే నెలలో యెరూషలేములో ప్రపంచ సదస్సు ఉంటుంద తెలిపినట్లు సెబాస్టియన్ తెలిపారు. అదేవిధంగా జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లో 'ఆలిండియా ఇండిపెండెంట్ డయాసిస్ యూనియన్'(ఎఐఐసి) ఆధ్వర్యంలో 4రోజులు కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశారు. కావున ప్రతి దైవజనుడు. దైవజనురాలు తమ డయాసిస్ యూనియన్‌లో చేరవలసినదిగా బిషప్ సెబాస్టియన్ ఆహ్వానం తెలిపారు.

**ఎఐఐసి కేంద్ర కార్యాలయం అడ్రసు మార్పు :** ఆలిండియా ఇండిపెండెంట్ చర్చెస్ యూనియన్(ఎఐఐసి) కేంద్ర కార్యాలయాన్ని రాజీవ్‌నగర్ విస్టియా ఎస్టేట్ అపార్ట్‌మెంట్స్ నుండి హైదరాబాద్‌కు పనిమీద వచ్చే ఎఐఐసి మెంబర్లైన పాస్టర్ల సౌలభ్యం కోసం స్పెన్సర్ ఎదుట, హైదరాబాద్ (బిర్యాని)హౌస్ ఒకటవ అంతస్తులోనికి నవంబర్ మొదటివారంలో మార్చడం జరిగిందని సెబాస్టియన్ తెలిపారు.

అదేవిధంగా నవంబరు 2వ వారంలో విజయవాడలో సేవకుల సదస్సు పెట్టే ఆలోచనలో ఉన్నట్టు బిషప్ హ్యారి సెబాస్టియన్ ఓ ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా సివైఎఫ్ 13వ వార్షికోత్సవ సంబరాలు, రక్తదాన శిబిరం

*లయన్ జానీ రాయ్, ప్రత్యేక ప్రతినిధి, 'క్రైస్తవ సమాజం', కాకినాడ, తూ॥గో॥జిల్లా*

**కాకినాడ** (తూ॥గో॥జిల్లా) : స్థానిక పాత బస్టాండ్, అంబేద్కర్ భవనంలో 'క్రిస్టియన్ యూత్ ఫెలోషిప్' (సివైయఫ్) 13వ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబరు 2వ తేది మద్యాహ్నం 2 గం॥ల నుండి 5గం॥ల వరకు రక్తదాన శిబిరం నిర్వహించబడింది. సుమారు 200 మంది క్రైస్తవ యువతీ యువకులు ఉత్సాహంగా ఈ శిబిరంలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ప్రారంభించిన ఈ శిబిరంలో మొదటిగా సివైఎఫ్ డైరెక్టర్ బిహెచ్.వి. మూర్తిరాజు రక్తదానం చేశారు. తదుపరి దడాలి విల్సన్, డి.చార్లెస్, బి.శ్యాంకుమార్, పి.విజయకుమార్, శ్రీమతి ఎలీ జబెత్‌రాణి, పట్టణ క్రైస్తవ నాయకులు డా॥వాసిరెడ్డి యేసు దాస్,జిఆర్ ఠాగూర్,బిషప్. జ్యోతి కుమార్, రెవ.ఐజక్ బెనర్జీ, డా॥రత్నకుమార్, బి.ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బృందగానాలు ఆలపిస్తున్న సివైఎఫ్ యూత్, ఇన్‌సెట్‌లో బిషప్ జ్యోతికుమార్, మోనికా రెడ్డి

సాయంత్రం 6గం॥ల నుండి అదే స్థలంలో సివైఎఫ్ 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. బిషప్ జ్యోతి కుమార్ రెడ్డి, ఏఆర్ పాల్సన్ ప్రత్యేక వర్తమానాలందించారు. సివైఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవ. బిహెచ్‌వి మూర్తిరాజు మాట్లాడుతూ 1997లో ముగ్గురితో ప్రారంభించబడిన ఈ సంస్థ నేటికి తూ॥గో॥జిల్లాలో 300లకు పైగా సమావేశాలు నిర్వహించి సుమారు లక్ష మంది యువతను సన్మార్గంలో నడిపించి రాష్ట్రంలో అనేకుల మన్ననలు పొందిందన్నారు. ప్రముఖ సువార్త గాయకులు ఆకుమర్తి డేనియల్, యం.డి రాజు మరియు యువ గాయని మోనికారెడ్డి (బిషప్ జ్యోతికుమార్ కుమార్తె) ఆలపించిన గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి. బిషప్ జ్యోతి కుమార్ మాట్లాడుతూ 2 రాజులులు 10:15 లో మాదిరిగా సివైఎఫ్ దేవుని పనియందు సమర్పణ, సిద్ధమనసస్సు కలిగి పనిచేస్తోందని, మీలో ఎవరికైనా అట్టి మనస్సుంటే చేతులు కలిపి పని చెయ్యాలని పిలుపునిచ్చారు. యౌవ నులు దేవుని చేతిలో ఆయుధాలని దేవుని రాజ్య వ్యాప్తి చేయుటలో వారి పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు.

డా॥ ఏఆర్ పాల్సన్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత భవిష్యత్తును గూర్చిన ఆలోచనలతో కృంగిపోతోందని, దాని నుండే ఆత్మహత్యలు,చింత,మతుకు బానిసలవ్వడం వంటివి జరుగుతున్నాయన్నారు. భూత వర్తమాన భవిష్యత్ కాలాలను ఎరిగిన దేవుని వైపు యువత తిరగాలని, సమస్యను గాక దాన్ని పరిష్కరించే ప్రభువు ఎదుట మోకరిల్లాలన్నారు. క్షణకాలం ఆనందం కొరకు ప్రాకులాడకుండా, దేవుడిచ్చే శాశ్వత ఆనందం, విశ్రాంతి కొరకై మారుమనస్సు పొంది ప్రార్థించాలన్నారు.

## ప్రసంగ సహకారి

(మన దేశంలో రజితోత్సవం దాటిన మాస పత్రిక)
ఎ.ఎం.జి. సాహిత్య సేవా విభాగ ప్రచురణలు

**ఎడిటర్ :** డా॥ ఎన్. జయకుమార్ రావు

**ఎవరికోసం :** బోధకులకు, బైబిల్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులకు, అన్ని సహవాసాల పాస్టర్లకు, స్కూల్ టీచర్లకు, క్రైస్తవ వేదాంతం చదివిన ప్రీచర్లకు, క్రిస్టియన్ డాక్టర్లకు, నర్సులకు ఉపయోగకరమైన వ్యాసాలుంటాయి.

*30 యేళ్ళ చరిత్ర*

**ముఖ్య సంపాదకులు :** అప్పడు ఎ.ఎం.జి. ఫౌండర్ సువార్తికులు రెవరెండ్ డా॥ జాన్ డేవిడ్ గారు, ఇప్పడు రెవరెండ్ డా॥ అరుణ్ కుమార్ కంటి మహంతి గారు (ఎ.ఎం.జి. డైరెక్టర్) ముఖ్య సంపాదకులు.

**సంపాదకులు :** రెవరెండ్ డా॥ ఎ.బి. మాసిలామణి గారు, ప్రప్రథమ సంపాదకులు. తరువాత కె. థామస్ నతానియేలు, జోబ్ లోహరా. 1995 నుండి నేను. వివిధ రూపాలు మారి నేటికి సరికొత్త రూపం సంతరించుకుంది. సర్వాంగ సుందరంగా మీ ముందు కొస్తోంది.

**ఇందులో :** స్పిరోస్ జోడియాటిస్ అమెరికాలో స్థిరపడి ఇటీవలే మహిమ ప్రవేశం చేశారు. గ్రీకు మాత్రు భాష. హెబ్రీ, గ్రీకు భాషలలో మహా పండితులై Study Bibles (KJV & NIV) with Strong's Famous Biblical Dictionery తయారు చేశారు. ఈయనది తప్పనిసరిగా ఒక పరిశోధనాత్మక వ్యాసం ఉంటుంది. బిల్లీగ్రేహం, భక్తసింగ్, రవి జకరియాస్, స్పర్జన్, మూడీ వంటి ప్రపంచ ప్రసిద్ధి చెందిన సువార్తికుల వ్యాసాలుంటాయి. ప్రసంగాలకు పనికొచ్చే సూచికలు, ఉపమానాలు, వింతలువిడ్డూరాలు, పుస్తక సమీక్షలు దీనిలో ఉంటాయి. తెలుగు సాహితీవేత్తల ప్రసంగాలు, కవితలు ఉంటాయి. ప్రభువు మహిమార్థం నేను విశాఖలో 1,2,3 అక్టోబరు 2010 తేదీలలో ప్రారంభించిన రాష్ట్ర స్థాయి తెలుగు సాహిత్య భాషా ఉద్యమం తాలూకు కొనసాగింపు **(Fallow-up)** ఉంటుంది.

బైట రంగురంగుల అట్టలు, లోపల రంగు పేజీలతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఇది ఉచిత పత్రిక. వార్షిక చందా రూ.100/-లు కేవలం పై ఖర్చులకు మాత్రమే. మొత్తం పేజీలు 36. 12 సంచికలకు వార్షిక చందా రూ.100/-. నెలకు 6000 కాపీలు అమ్ముడవుతున్న ప్రసంగ సహకారిని తెప్పించుకోండి.

అడ్రస్ :
**డా॥ ఎన్. జయకుమార్ రావు,** ఎడిటర్, ప్రసంగ సహకారి
50-44-4, సీతమ్మధార, విశాఖపట్నం - 13

పలయువగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను...యెష. 9:6

ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్
నర్సాపురం టౌన్ & మండల్

అందరికీ క్రిస్మస్ ఆహ్వానం

2010 డిసెంబరు 4
శనివారం సా॥ 6 గం.లకు

ఓపెన్ థియేటర్ నర్సాపురం

సందేశం
రెవ. డా॥ టి.ఎ. ప్రభు కిరణ్ గారు
(ఒకనాడు ప్రముఖ జర్నలిస్ట్, నేడు క్రీస్తు సువార్తను దశదిశలకు చాటుతున్న విశిష్ట సువార్తికుడు మరియు ప్రముఖ దిన పత్రిక 'సాక్షి' ఫ్యామిలీలో అద్భుత వర్తమానాలందిస్తున్న దైవజనులు, హైదరాబాద్)

- అన్ని సంఘములు, సంస్థలు ప్రదర్శించే అభినయ గీతములు, బృంద గానాలు స్కిట్స్
- ప్రముఖ గాయనీగాయకుల క్రిస్మస్ గానాలు, అద్భుత సంగీతం...

ఈ క్రిస్మస్ దేవునికి మహిమకరంగా జరుగునట్లు ప్రార్థించగోరుచున్నాము

ప్రేమతో ఆహ్వానించువారు
కార్యవర్గ సభ్యులు, ఎఐసిసి టౌన్ మరియు మండల శాఖ, నర్సాపురం

ఏ విద్యార్హత లేకపోయిన C.Th. తో ప్రారంభించి D.D. వరకు చేయవచ్చును.

ది హెబ్రోన్ ఓపెన్ యూనివర్సిటీ
THE HEBRON OPEN UNIVERSITY
(Christian Research and Training Courses)
Govt. Regd. No. 138/06, (Autonomous) India and International USA
C.Th., B.Th., B.D., M.Div., M.Th., D.D., & Ph.D.,

ఇంటివద్దనే వుండి ఎవరి పనులు వారు చేసుకుంటూ పోస్ట్ ద్వారా చేయుటకు పైన వివరించిన (కరస్పాండెన్స్ కోర్సులు) కలవు. ఏ బేధంము లేకుండ వారి వారి అర్హతను బట్టి ప్రతి ఒక్కరు తక్కువ ఫీజులతో చేయుటకు అనుకూలమైన బైబిల్ కోర్సులు మరియు మేరేజి లైసెన్స్ అప్లై చేయుటకు కావలసిన అర్హతకు మరియు "ఆర్డినేషన్ సర్టిఫికెట్" కావలసినవారు రూ.100/- లు యం.ఓ. చేసి అప్లికేషన్ ఫారం మరియు వివరములు పొందగలరు.

127 దేశాలలో గుర్తింపు కలిగిన యూనివర్సిటీ నుండి ఎఫిలియేషన్ కలిగివున్నది.

వివరములకు : ప్రిన్సిపల్ / కరెస్పాండెంట్, బ్రదర్. యం.డబ్ల్యు. జోబ్, B.A., B.D.,
డోర్ నెం.: 17-6-8/1, ఖాదర్ వీధి, పూర్ణానందంపేట, విజయవాడ-520 003
ఫోన్ : 0866-2576167, సెల్ : 9848150167

తెలుగు క్రిస్టియన్ హిట్ సాంగ్స్ కొరకు దర్శించండి : www.jeevajalamulu.com

# నిడదవోలు క్రైస్తవ సమాధుల తోట అభివృద్ధి కొరకు తీర్మానం

రెవ. జి. ప్రమోద్ కుమార్, ప్రతినిధి, 'క్రైస్తవ సమాజం', నిడదవోలు, ప॥గో॥జిల్లా

**నిడదవోలు**(ప॥గో॥జిల్లా) : చాలా సంవత్సరాల నుంచి సమాధుల తోట అపరిశుభ్రంగా ఉంటోంది. సమాధుల తోట చుట్టూ ఉన్నవారు దీన్ని పబ్లిక్ టాయ్‌లెట్‌లా వాడుకుంటున్నారు. భూస్థాపన కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు లోపలకు అడుగు పెట్టలేనంత అపరిశుభ్రంగా ఉంటోంది. చుట్టూ ప్రహరీ గోడ లేదు. ఈ సమస్యను కొన్ని నెలల క్రితమే 'క్రైస్తవ సమాజం' పెద్దల దృష్టికి తెచ్చిన విషయం పాఠకులకు విధితమే.

ఎట్టకేలకు ఈ బరియల్ గ్రౌండ్ అభివృద్ధి కొరకు కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు బ్రదర్ జె.రాంబాబు ఎమ్మార్వో ఆఫీసు ఎదురుగా మూడు రోజులు నిరాహార దీక్ష చేసారు. ఈ దీక్షకు స్థానిక సంఘ కాపరులు మరియు సంఘములు తమ పూర్తి మద్దతును రాంబాబుకు తెలిపారు. స్థానిక ప్రభుత్వ అధికారులు మరియు స్థానిక ఎమ్మెల్యే బూరడపల్లి శేషారావు స్పందించి సమాధుల తోట అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని లిఖితపూర్వక హామీలు ఇచ్చి రాంబాబును నిరాహార దీక్ష నుండి విరమింపజేశారు. ఎమ్మెల్యే శేషారావు సమాధుల తోట అభివృద్ధికై 2 లక్షల రూపాయిల విరాళాన్ని స్థానిక సంఘ నాయకులకు అందజేశారు.

అక్టోబరు 18వ తేది ఉదయం 9గంటలకు కృపాధార లూథరన్ చర్చి ఆవరణలో జె.రాంబాబు అధ్యక్షతన స్థానిక క్రైస్తవ సంఘ నాయకులు సమావేశమయ్యారు. రెవ. దొరైరాజు ప్రార్థనతో ప్రారంభమైన ఈ సమావేశంలో తీసుకున్న తీర్మానాలు ఈ విధంగా ఉన్నాయి.

1. సమాధుల తోట అభివృద్ధికి అభివృద్ధి చెందిన సంఘాలు నెలకు రూ.100/-లు. అభివృద్ధి చెందుతున్న సంఘాలు నెలకు రూ.50/-లు చొప్పున చందా ఇవ్వాలి.

2. సమాధుల తోట కాపుదలకు ఒక కావలి వాని నియమించి అతనికి నెలకు రూ.3000/- వేతనం చెల్లించాలి.

3. సమాధుల తోటకు ఒక నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు.

**నూతనంగా ఎన్నుకోబడిన నిడదవోలు బరియల్ గ్రౌండ్ డెవలప్‌మెంట్ కమిటీ :**

రెవ.కె.దొరైరాజు(గౌరవ అధ్యక్షులు), బ్రదర్ జె. రాంబాబు(అధ్యక్షులు), రెవ. డోనాల్డ్(ఉపాధ్యక్షులు),రెవ.గుణ సామ్యేల్ (సెక్రటరీ), బ్రదర్ కె. సుధాకర్(జాయింట్ సెక్రటరీ), రెవ. డి.కరంచంద్(ట్రెజరర్), రెవ. లివింగ్‌స్టన్(జాయింట్ ట్రెజరర్). సభ్యులుగా రెవ. ప్రమోద్ కుమార్, రెవ. అబెద్నెగో, ఎస్. ఎస్.జె. కృపావరం, సిస్టర్ జాయ్‌జాన్, ఎమ్. ఎల్. దేవ సహాయం, రెవ.యం.జాన్సన్, పాస్టర్ ఎల్.జేమ్స్, ఎన్. నాగరాజు, వి. శ్రీను, కె.కృష్ణ తదితరులు ఎన్నికయ్యారు.

'క్రైస్తవ సమాజం' సెల్ : 9963069484

# ఎఐసిసి ఆధ్వర్యంలో అభిషేక కార్యక్రమం

## రాష్ట్ర స్థాయి ప్రముఖులచే సర్టిఫికేట్‌ల అందజేత

**తణుకు/తాడేపల్లిగూడెం**(ప॥గో॥జిల్లా) : ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్(ఎఐసిసి) పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పాస్టర్, రెవరెండ్, బిషప్ అభిషేక కార్యక్రమం ఏర్పాటు చేయబడిందని, ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయబడిన ఈ కార్యక్రమం నవంబరు 22వ తేదిన తాడేపల్లిగూడెం సమీపంలోని ముదునూరుపాడు స్వస్థత శాల ప్రాంగణంలో జరుగుతుందని ఎఐసిసి జిల్లా అధ్యక్షులు బిషప్ యం.జగ్జీవన్ తెలిపారు.

ఆ రోజు అభిషేకాలకు ఎంపికైనవారు 20వ తేది ఉదయం నుండి సాయంత్రం వరకు ప॥గో॥జిల్లా తణుకు, స్పిరిట్ & లైఫ్ చర్చిలో జరిగే ఆత్మ సిద్ధపాటు కార్యక్రమానికి తప్పక హాజరు కావాలన్నారు. ఈ అభిషేకాల విషయంలో మరిన్ని వివరాలకు తమను సంప్రదించవచ్చన్నారు.

ఎఐసిసి ప॥గో॥జిల్లా శాఖ దేశంలోనే ఒక ప్రాధాన్యతను సందరించుకుందని, అనేక కార్యక్రమాలు ఎఐసిసి జిల్లా శాఖ భవిష్యత్తులో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో ఎఐసిసి ఉనికి లేని పరిస్థితిలో ఉండగా జిల్లాలో మాత్రం యించుమించు అన్ని మండలాల్లో కమిటీలుండి సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, ఈ విషయంలో రాష్ట్ర నూతన అధ్యక్షులు రెవ.కాంద్రు ప్రభుకుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి శాంపాల్ తమను అభినందించినట్లు తెలిపారు.

ఈ అభిషేకాల విషయంలో మరిన్ని వివరములు కావలసినవారు 9491718 283, 9948161007 నెంర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.




- రాష్ట్రంలో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా జరిగిన పంటలు, ఆస్తుల నష్టం నుండి ప్రజలు త్వరగా కోల్కొనునట్లును, వివిధ వ్యాధుల బారిన పడినవారి సంపూర్ణ స్వస్థత కొరకును ప్రార్థించండి
- రాష్ట్రంలో మన ఇంజనీరింగ్ కాలేజీలు, విద్యా సంస్థలు ఏ విధమైన నష్టాలలో పడకుండా, మంచి అభివృద్ధిని సాధించునట్లు. విద్యార్థులకు ఉత్తమ బోధననందించ గల్గునట్లు.
- విజయవాడ 'విజయ హెల్త్ ఇనిస్టిట్యూట్' నిమిత్తం. వ్యవస్థాపకులు అర్జునరావు పరిచర్యల నిమిత్తం.
- ఏలూరులో బిషప్ జాన్ ములగడ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సిటీ హెల్త్ సెంటర్ ద్వారా అనేక మంది వైద్య సేవలందుకొను నిమిత్తం.
- ఏలూరు కర్మేలు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, శుభవార్త టి.వి వర్తమానికులు రెవ. ఎబినేజర్ ఆరోగ్యం నిమిత్తం.
- పాస్టర్ కారుపాటి శాంతి సాగర్ ఆధ్వర్యంలో డిశెంబరులో నూతనంగా ప్రారంభం కానున్న 'యేసే పరిష్కారం' టి.వి. ఛానెల్ యొక్క ప్రసారాల విజయవంతం కొరకు.
- ఏలూరులో పాస్టర్లంతా ఒకే సహవాసంగా ఏర్పడునట్లు. సేకుల మధ్య ఐకృత ఉండేలా.
- డిశెంబరు నెలలో ప్రపంచ వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న క్రిస్మస్ వేడుకల కొరకు.
- వివిధ టి.వి. ఛానెల్స్ ద్వారా జరుగుచున్న పరిచర్యల కొరకు.
- ఆసుపత్రులు, విద్యా సంస్థలు, శరణాలయాలు, ముద్రణాలయాలు, రేడియో తదితరమైన వాటి ద్వారా జరుగుచున్న పరిచర్యల కొరకు.
- గుండె బైపాస్ సర్జరీకి ఈ నెల 4వ తేదిన హైదరాబాద్ వెళుతున్న ప॥గో॥జిల్లా పెంటపాడు వాస్తవ్యులు, బేత్ షాలోమ్ సంఘ కాపరి రెవ. పి.మార్కాచార్యులు కొరకు.
- తూ॥గో॥జిల్లా శంఖవరం వాస్తవ్యులు పులి రాధాకృష్ణ, సుమన దంపతుల ద్వితీయ కుమార్తె పులి మేగీ 2వ జన్మదిన వేడుక అక్టోబరు 9వ తేదిన జరుపుకొంది. పాప వయస్సునందు, జ్ఞానమందు, దేవుని దయలోను. మనుష్యుల దయలోను ఎదిగి వర్థిల్లునట్లు ప్రార్థించ గోరుచున్నారు.
- నవంబరు 22న ముదునూరుపాడులో ఎఐసిసి ప॥గో॥జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరగనున్న అభిషేకాల కార్యక్రమం కొరకు.

# బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ

# ద్విశతాబ్ధి వారికోత్సవాల విజయానికి సహకరించండి

## బిఎస్ఐ నర్సాపురం విభాగం పిలుపు

**నర్సాపురం**(ప॥గో॥జిల్లా) : గుంటూరు వేదికగా జరగనున్న బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ద్విశతాబ్ధి (1811-2011) ఉత్సవాలను విజయవంతం చెయ్యాలని బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా నర్సాపురం విభాగం స్థానిక క్రైస్తవ సంఘాలకు పిలుపు నిచ్చింది.




సమావేశాన్నుద్దేశించి మాట్లాడుతున్న అధ్యక్షుల డా॥ విల్సన్. వేదికపై సూర్యప్రకాష్, రత్నరాజు, దేవరాజు, ఏలియారాజు తదితర్లు

ఫిబ్రవరి 19,20,21 తేదిలలో భారీ స్థాయిలో జరిగే ఈ ఉత్సవాలకు అత్యధిక సంఖ్యలో విశ్వాసులు, పాస్టర్లు, క్రైస్తవ నాయకులు కదలి రావాలని కోరింది. ఈ మేరకు అక్టోబరు 16వ తేది సాయంత్రం 7 గంటలకు నర్సాపురంలోని 'ఇమ్మానుయేల్ హ్యాండీ క్రాఫ్ట్స్' ప్రాంగణంలో బిఎస్ఐ నర్సాపురం విభాగం ట్రెజరర్ కొండాపు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఒక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షులు డా॥ కె. విల్సన్, కార్యదర్శి ప్రకాశరావు, కోస్టల్ ఆంధ్ర బిఎస్ఐ కోర్డినేటర్ మేడిది జాన్సన్, ఆగ్జిలరీ కమిటీ మెంబర్ రాపాక రత్నరాజు, ఎఐసిసి నర్సాపురం టౌన్ మరియు మండల శాఖ అధ్యక్షులు అపో॥ కె.ఏలియా రాజు, గిడియన్స్ ఇంటర్నేషనల్ నర్సాపురం శాఖ ప్రెసిడెంట్ దాసరి దేవరాజు తదితరలు పాల్గొని మాట్లాడారు.

1811 ఫిబ్రవరి 21వ తేదిన 'బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా' గా ఆవిర్భవించి కలకత్తా నగరాన్ని కేంద్రంగా చేసుకొని ఎంతో మంది స్థానిక విశ్వాసుల సహకారంతో నిర్విఘ్నంగా పనిచేసి అనేక భారతీయ భాషల్లోకి దేవుని వాక్యాన్ని అనువదించి కోట్లాది మందికి దైవ వాక్యాన్ని అందిస్తూ 2011 ఫిబ్రవరి 21 నాటికి 200 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ తరుణంలో ఈ ఉత్సవాలను మన రాష్ట్రంలో జరుపుట దేవుడు మనకిచ్చిన ఆధిక్యతగా భావించా లన్నారు. దేశ నలుమూలల నుండి ఎంతో మంది కీర్తి ప్రతిష్టలు పొందిన విద్యాధికులు, విజ్ఞులు ఈ ఉత్సవాలలో పాల్గొనేందుకు ఇప్పటి నుండే సన్నాహాలు చేస్తున్నారన్నారు. అలాగే దేశ విదేశాల నుండి అనేక మంది అంతర్జాతీయ నాయకులు ఈ ఉత్సవాలలో పాల్గొనేందుకు విచ్చేస్తున్నట్లు ఆయన ఈ సమావేశంలో నాయకులు తెలిపారు.

ఈ ఉత్సవాలలో అంతర్జాతీయ సువార్తికులు రెవ.డా॥ మిలాయ్ మిల్లర్ (రిటైర్డ్ జనరల్ సెక్రటరీ, యుబిఎస్, యు.కె), రెవ.డా॥ రాబర్ట్ కన్విల్(అంతర్జాతీయ బిల్లీగ్రాహం ఇవాంజలిస్టిక్ అసోసియేషన్ సువార్తికులు మరియు వైస్ ప్రెసిడెంట్ యుబిఎస్), డా॥ పాల్ దినకరన్(జీసస్ కాల్స్), డా॥ బి.కె. ప్రమాణిక్(జనరల్ సెక్రటరి, బిఎస్ఐ), మరెందరో జాతీయ, అంతర్జాతీయ దైవ సేవకులు ఈ ఉత్సవాల్లో వాక్యోపదేశం అందిస్తారని వారు తెలిపారు.




పవర్ పాయింట్ ద్వారా వివరిస్తున్న బ్రదర్ రాపాక రత్నరాజు

బైబిల్ సొసైటీ ఆవిర్భావం, బైబిల్ మన చేతిలోకి రావడం వెనుక ఎంత శ్రమ దాగి ఉందో, ఎంత మంది తమ ప్రాణాలను సహితం ధారపోయవలసి వచ్చిందో తెలిపే పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను బ్రదర్ రాపాక రత్నరాజు ప్రదర్శించారు. అనంతరం అందరికీ సూర్యప్రకాష్ ప్రేమ విందు ఏర్పరచారు. ఈ ఉత్సవాలకు ఆర్థికంగా సహకారమందించాలనుకున్నవారు తమను సంప్రదించ వచ్చని సూర్యప్రకాష్ తెలిపారు.



# తణుకు రీజనల్ బిషప్‌గా రెవ. డా॥ జి.యస్.హనోకు

**తణుకు**(ప॥గో॥జిల్లా) : గత 22 సంవత్స రాలుగా దేవుని పరిచర్యలో చేసిన ప్రభువైన యేసు క్రీస్తు బోధలను మరియు సంఘ కార్య క్రమాలను గుర్తించి అపోస్తలిక్ చర్చ్ ఆఫ్ ఇండియా చెన్నై డయాసిస్ వారు బిషప్ రైట్ రెవరెండ్ ఎస్ఎమ్ జయకుమార్, కార్డినల్ బిషప్ & ప్రెసిడెంట్ ఆఫ్ ఎసిఐ డయాసిస్ వారిచే తణుకు మండలం పైడిపర్రు గ్రామం లో ఉన్న 'నవజీవన సహవాస సమాజం' (ఎన్‌జెఎస్ఎస్ చర్చి)సంఘ కాపరి రెవ. డా॥ జి.యస్ హనోక్‌ను బిషప్‌గా అభిషేకించారు.



సెప్టెంబరు 28వ తేది మంగళవారం ఎన్‌జె ఎస్ఎస్ చర్చిలో హనోకును తణుకు రీజనల్ బిషప్‌గా అభిషేకించారు. ఈ సభ సందర్భంగా ఇందులో పాల్గొన్న పట్టణ క్రైస్తవ పెద్ద లు, పుర ప్రముఖులు మరియు యుసిఎ నాయకులు, టియుపిఎఫ్ నాయకులు మొదలగు అనేకమంది పెద్దలు శుభాలు తెలియజేశారు.

ఇప్పుడు వీరి ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా సేవ చేసుకుంటూ ఎపిస్కోపికల్ ఆర్డినేషన్ పొందిన దైవజనులు 100 మంది సేవ చేస్తున్నారు.




**మీ ప్రాంతంలో 'క్రైస్తవ సమాజం' పత్రికను పరిచయం చేయండి.**

**వివరాలకు : ఎడిటర్, 'క్రైస్తవ సమాజం',**

**11-6-26/1, గాంధీనగర్-2, నర్సాపురం - 534 275**

**ప॥గో॥జిల్లా. సెల్ : 9963069484**

# క్రైస్తవేతర జనబాహుళ్యంలోకి క్రైస్తవ సాహిత్యం చేరాలి

## ఆంధ్ర రాష్ట్ర క్రైస్తవ కవి సమ్మేళనంలో వక్తలు

కె. జోసెఫ్ స్టీఫెన్, ప్రతినిధి, 'క్రైస్తవ సమాజం', మహావిశాఖ

*(12వ పేజీ తరువాయి)* క్రైస్తవులు ప్రచురించే పుస్తకాలలో చాలా వరకు భాషా పరమైన ప్రయోగాలు సమకాలీన సాహిత్యానికి భిన్నంగా ఉండడంవల్ల క్రైస్తవేతర జన బాహుళ్యంలోకి చేరడంలేదని ప్రముఖ కవి, రచయిత డా॥ ఎన్.విజయకుమార రావు ఆవేదన వ్యక్తం చేశారు. మహా విశాఖ నగరంలో అక్టోబరు 1,2,3, తేదీలలో స్థానిక వైయంసిఎ సెమినార్ హాల్స్‌లో ఆంధ్ర రాష్ట్ర స్థాయి తెలుగు క్రైస్తవ కవి సమ్మేళనం, సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవికోకిల గుఱ్ఱం జాషువా, పద్మ శ్రీ, కళాప్రపూర్ణ డా॥ జ్ఞానానంద కవి, కళా ప్రపూర్ణ డా॥ జాలాది కవి వంటి పేరుపొందిన మహా కవుల రచనలను చూసి, వారి సాహిత్యంలోని విషయపరిజ్ఞానాన్ని అర్థం చేసుకొని రచనలు సాగించాలని రచయితలను కోరారు.

కవి సార్వభౌమ రెవ. పురుషోత్తమ చౌధరి 208వ జయంతి జందర్భంగా మహా విశాఖ వైయంసిఎ ఆధ్వర్యంలో ఈ రాష్ట్ర స్థాయి క్రైస్తవ కవి సమ్మేళనం, సన్మానం దేవుని మహిమార్థమై ఘనంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుండి సుమారు 100 మంది వరకు సాహితీవేత్తలు పాల్గొని తమ రచనలు, కవితా ఖండికలు సమర్పించారు.

### కవి సమ్మేళన ప్రారంభ వేడుకలు :

ఈ సందర్భంగా అక్టోబరు 1వ తేది మధ్యాహ్నం జరిగిన ప్రారంభ సభకు మహా విశాఖ వైయంసిఎ అధ్యక్షులు ప్రకాష్ బెన్హర్ అధ్యక్షత వహించారు. ఈ సభలో నేషనల్ వైయంసిఎ ఉపాధ్యక్షులు రోలాండ్ విలియమ్స్, ప్రొఫెసర్ వి. అబ్రహాం, బి.శివాజీ రాజు, డా॥ డి.బి.ఎల్. కొండెపోగు లు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వైయంసిఎ కార్యవర్గ సభ్యులు కె. శామ్ చెరియన్, జి. స్టీవెన్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక ఆకర్షణ :** భారత ప్రభుత్వం వద్ద నుండి అత్యున్నత పద్మశ్రీ అవార్డు, తెలుగు భాషా సాహితీ ప్రపంచంలో 5 విశ్వ విద్యాలయాలచే డాక్టరేట్లు అందుకున్న కళాప్రపూర్ణ ఆచార్య తిమోతి జ్ఞానానంద కవి మరియు కళాప్రపూర్ణ డా॥ జాలాది కవులు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా క్రైస్తవ కుటుంబ నేపథ్యం కలిగి పలు ఉన్నత శిఖరాలు అధిరోహించి, తెలుగు భాషా సాహిత్యంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్న వీరిరువురినీ సభకు విచ్చేసిన కవులు రచయితలు మరియు రెవ. పురుషోత్తమ చౌధరి ట్రస్ట్ తరపున డా॥ జయకుమార రావు ఘనంగా సన్మానించారు.

## క్రైస్తవ సాహిత్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలి

### ముగింపు సభలో మంత్రి మాణిక్య వరప్రసాద్

అక్టోబరు 2వ తేది సాయంత్రం స్థానిక విశాఖ కళాభారతి ఎ.సి. ఆడిటోరియంలో జరిగిన ముగింపు సభలో రాష్ట్ర ప్రాథమిక, మాధ్యమిక విద్యా మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రధాన వక్తగా పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ క్రైస్తవులలో ఎందరో గొప్ప కవులు ఉన్నారని, వీరంతా తెలుగు క్రైస్తవ సాహిత్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలన్నారు. మత ప్రబోధకులు ప్రజలకు మార్గనిర్దేశం చెయ్యాలే తప్ప దేవుడు ఏదో ఇస్తాడని చెప్పి ప్రలోభ పెట్టరాదన్నారు. సభలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ మాట్లాడుతూ సాహిత్యం సామాన్యులకు అర్థమయ్యే రీతిలో ఉంటే భావం వేగంగా ప్రజలలోకి చేరుతుందన్నారు. ఆయన కొన్ని కీర్తనలు ఆలపించారు. అనంతరం ప్రముఖ అంతర్జాతీయ బైబిల్ పరిశోధకులు రెవ. డా॥ దాస్ బాబు డా॥ జయకుమార రావు రచించిన 'మనసు లోతుల్లోకి దూరి' కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ కవితా సంపుటిని ఎ.ఎం.జి. ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డా॥ అరుణ్ కుమార్ మహంతికి అంకితమిచ్చారు.

## రెవరెండ్ పురుషోత్తమ చౌధరి ట్రస్ట్ ప్రారంభం

క్రైస్తవ రచయితలు, కవులు అటు గ్రాంథికం కాకుండా, ఇటు వ్యవహారిక భాష కాకుండా చేస్తున్న పద ప్రయోగాలు సామాన్యులకు అర్థం కావడం లేదు. అందునా ముఖ్యంగా బోధకులు ఉపయోగించే భాషా శైలి ఇతర మతస్తుల వారికి సరైన రీతిలో అర్థం అవడం లేదు. దీనితో పలు క్రైస్తవ పుస్తకాలు, రచనలు క్రైస్తవ బుక్ షాపులలో తప్ప ఇతర బుక్ షాపులలో కనబడడం లేదు. దీనిని గమనించిన డా॥ ఎన్. జయకుమార రావు రెవరెండ్ పురుషోత్తమ చౌధరి ట్రస్ట్ ను తన సన్నిహితులు, శిష్యుల సహకారంతో ప్రారంభించి తెలుగు క్రైస్తవ భాషా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ట్రస్ట్ ద్వారా వాడుక భాషలో ప్రజలకు క్రైస్తవ రచనలు, పుస్తకాలు అర్థమయ్యే రీతిలో ప్రోత్సహించాలని సంకల్పించారు.

ఇంకా ఈ క్రైస్తవ కవి సమ్మేళనంలో భారతీయ వాయిద్యాలతో రెవ. చౌధరి రచించిన ప్రఖ్యాత కీర్తనలను శాస్త్రీయ సంగీతాచార్యులు డా॥ కె.ఎస్. చంద్రశేఖర్ (ఆలిండియా రేడియో), తన బృందంతో ఆలపించారు. రెవ. చౌధరి జీవిత చరిత్ర మరియు సాహితీ పరిశోధకులు డా॥ బి.డి.పి రావు (రాజమండ్రి), రెవ. జోసెఫ్ మురాల, శ్రీమతి ఝాన్సీ, డా॥ సుధాకర్(110 డిగ్రీలు సాధించిన వ్యక్తి-ఆలిండియా రేడియో) తదితర ప్రముఖులెందరో రాష్ట్ర నలు మూలల నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ కవితా సంపుటులను సమర్పించిన కవులనందరినీ శాలువ, కండువాలతో సత్కరించారు. కవులకు పంచెలు, స్త్రీ కవులకు చీరలు, పుస్తకాలు బహుకరించారు.

**కొసమెరుపు :** విశాఖపట్నంలో జరిగిన ఈ కవి సమ్మేళనంలో ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుండి క్రైస్తవ సాహితీ వేత్తలు అతి తక్కువగా హాజరయ్యారు. దీనిపై కన్వీనర్ డా॥ జయకుమార రావును వివరణ కోరగా ఇది మా తొలి ప్రయత్నమని రాబోయే రోజులలో దీనిని సరిదిద్దుకొని అన్ని ప్రాంతాల నుండి ప్రాతినిధ్యం ఉండేలా కృషి చేస్తామని తెలిపారు.




**తెలుగు క్రిస్టియన్ హిట్ సాంగ్స్ కొరకు దర్శించండి : www.jeevajalamulu.com**




అక్టోబరు 1,2,3 తేదిలలో మహా విశాఖ నగరం వైయంసిఎ ఆధ్వర్యంలో జరిగిన 'ఆంధ్ర రాష్ట్రక్రైస్తవ కవి సమ్మేళనం' కు రాష్ట్ర నలుమూలల నుండి హాజరైన సుమారు 100 మంది సాహితీ వేత్తల సమక్షంలో ప్రముఖ కవి, రచయిత డా॥ ఎన్. విజయకుమార రావును ఘనంగా సత్కరిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్‌లలో ఎడమ నుండి) ఉపన్యసిస్తున్న రాష్ట్ర మంత్రి మాణిక్యవరప్రసాద్. పురుషోత్తమ చౌధరి ట్రస్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మాణిక్యవరపసాద్, ఎ.ఎం.జి. డైరెక్టర్ రెవ. మహంతి, డా॥ విజయ కుమార్, రెవ. డా॥ దాస్‌బాబు తదితరులు. *(సంబంధిత వార్త 10వ పేజీలో)*




## ఫలం - నిష్ఫలం

అతడు పైకి సామాన్యంగా కనిపిస్తాడు. చూపుల లోతులు చూస్తే మాత్రం అండ పిండ బ్రహ్మాండాలను అరచేతిలో ఇముడ్చుకున్నాడా అనిపిస్తుంది. ఒకరోజు, చుట్టూ గుమిగూడిన జనానికి ఓ కథ చెప్పాడు.

గింజలు చల్లడానికి వెళ్ళిన రైతు కథ. దారి పక్కన పడ్డ గింజలు పక్షుల పాలయ్యాయి. మట్టి లోతుగా లేని రాతి నేల మీద పడ్డవి వేరులోతుగా పారక మొలిచినట్టే మొలిచి సూర్యరశ్మి వేడికి వాడిపోయి, ఎండిపోయాయి. ముళ్ల మొక్కల్లో పడ్డ వాటిని అవి పెరగనివ్వలేదు. కొన్ని గింజలు మాత్రం సారవంతమైన నేలమీద పడ్డాయి. కుప్పలు తెప్పలుగా పండింది పంట.

ఎవరికి ఎంతవరకు అర్థమైందో గానీ, శిష్యులకు మాత్రం అంతరార్థం ఆయనే విప్పి చెప్పాడు. రైతు, దైవ వార్తాహరుడు. గింజలు దైవసందేశాలు. గింజలు పడ్డ స్థలాలు మానవ హృదయాలు. కొందరు దారినపోతూ విన్నట్టుగా వింటారు. దుష్ట స్నేహితులనే పక్షులు ఆ మాటలను నాటుకోనివ్వవు. కొందరు సందేశాలు వింటారు. మెచ్చుకుంటారు. ఇకనుండి మంచిగా ఉంటామని నిర్ణయించుకుంటారు. మాటలు నాటుకున్నా మట్టిలో లోతులేక వేరు పారదు. మరొక రకం మనుషులుంటారు. స్వామి వారి సందేశాలు వింటారు. అవతలకు వెళ్ళగానే సంసార సాగరం వారిని ముంచేస్తుంది. ముళ్ళ మొక్కల్లో పడతారు. మత్తుగా పడుకునే గొంగళి పురుగులు చిరిగిన కోట్లున్న కోటీశ్వరరావులు. వీపున పాపాల మాటలున్న వీరేశ్వరరావులు, ముళ్ళపొదలు మొక్కల్ని తొక్కేస్తాయి. సత్య సందేశాలకు సత్ఫలితాలు శూన్యం.

ఇక ఉత్తములుంటారు సుసందేశాలు సూటిగా నాటుకుంటాయి. బ్రతుకు బాటను మార్చుకుంటారు. కుంచెడు మంచి మాటల గింజలు సంచులకొద్దీ ధాన్యాన్ని పండిస్తాయి. ముప్పయి, అరవై, నూరంతల పంట, సత్సందేశాలు కొందరికి ఫలం, కొందరికి నిష్ఫలం.

ఈ లోకోత్తర సందేశాన్ని అందించినవారు యేసుక్రీస్తు చిన్నరైతన్న సౌమ్యంలో చిదంబర రహస్యాలు, ఇందులో పాపపుణ్యాల ప్రసక్తి ఉంది. నీతి మాటల లోతులున్నాయి. ఇలాంటి బోధలు కోకొల్లలుగా ఉన్న పుస్తకం బైబిల్లో భాగమైన 'క్రొత్త నిబంధన' గ్రంథం. క్రైస్తవేతరులకు చక్కగా బోధపడే సులభ శైలిలో వెలువడింది. 564 పేజీలు. పోస్టుకార్డు మీద వ్రాస్తే చాలు, మీ చిరునామాకు ఉచితంగా పంపిస్తాం.



DR. N. JAYA KUMAR
EDITOR: PULPIT HELPS

**నిరీక్షణ**

ఇదీ మా అడ్రసు : పోస్ట్‌బాక్స్ నెం.608, సీతమ్మధార, విశాఖపట్నం-530013, ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్:891-2550731, 9848190731

**ఉచితం**

































*Publisher & Owner* ***Vepuri Sam Sudhakar,*** *Printer Ponnapalli Srinivasa Rao, Printed at Creative Services, D. No. 1-1-55/3, Upstairs, Opp SBI, Narsapur-534 275, W. G. Dt., A. P. Published at 11-6-26/1, Gandhi Nagar-2, Narsapur-534 275, W. G. Dt., A. P., Editor* ***Vepuri Sam Sudhakar (Cell : 9963069484)***

